# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 8

మంగళవారం, డిసెంబర్ 5, 2023

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## నామినేటెడ్ పదవులకు రాజీనామా సమర్పించిన బీఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో నియమితులైన బీఆర్ఎస్ నేతలు రాజీనామా బాట పట్టారు. తమ పదవులనుంచి వైదొలగుతూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు సంబంధిత శాఖల కార్యదర్శులకు రాజీనామా లేఖలు పంపిస్తున్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ పదవికి బోయినపల్లి వినోద్ కుమార్, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్ పదవికి జ్వాల నరసింహారావు వనం సోమవారం రాజీనామా చేశారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు పదవికి రిటైర్డు ఐఏఎస్ అధికారి రమణాచారి, తెలంగాణ గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ తమ పదవులకు రాజీనామా చేశారు. వీరితో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలో పలు ప్రభుత్వ కార్పొరేషన్ చైర్మన్లుగా నామినేటైన నేతలు కూడా వైదొలగుతున్నారు. డాక్టర్ ఆంజనేయగౌడ్ (స్పోర్ట్స్ అథారిటీ), సోమ భరత్‌కుమార్ (డెయిరీ డెవలప్‌మెంట్), జూలూరి గౌరీశంకర్ (తెలంగాణ సాహిత్య అకాడమీ),

- మిగతా 2వ పేజీలో



# ఓవర్ టు ఢిల్లీ..!

**ఖరారు బాధ్యత హైకమాండ్‌దే..**
**సీఎంగా రేవంత్‌వైపే మెజార్టీ ఎమ్మెల్యేల మొగ్గు**
**డీకేతో భట్టి, ఉత్తమ్, కోమటిరెడ్డి భేటీ**
**తమ పేర్లూ పరిశీలించాలని వినతి**
**సందిగ్ధావస్థలో అధిష్ఠానానికి నివేదన**
**గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో**
**ప్రమాణ స్వీకారం వాయిదా**
**ఢిల్లీ వెళ్లి ఖర్గేను కలిసిన పరిశీలకులు**
**నేడు మరోసారి భేటీ**
**సోనియాతో సంప్రదించాక తుది నిర్ణయం**

**హైదరాబాద్:** తెలంగాణకు కాబోయే ముఖ్యమంత్రి (సీఎల్పీ నేత) ఎవరనే విషయంలో కాంగ్రెస్‌లోని అత్యధిక ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డివైపు మొగ్గు చూపినా సోమవారం రాత్రి వరకు పార్టీ అధిష్ఠానం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాలేదు. కొందరు సీనియర్లు సీఎం అభ్యర్థిత్వానికి తమ పేర్లూ పరిశీలించాలని కోరడం, ఎమ్మెల్యేల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో విషయం అధిష్ఠానం పరిధిలోకి వెళ్లింది. అక్కడి నుంచి అధికారికంగా అనుమతి రాకపోవడంతో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వాయిదా వేశారు. సోమవారం మధ్యాహ్నమే సీఎల్పీ సమావేశంలో చర్చించి.. సీఎం అభ్యర్థిని ఎంపిక చేసే బాధ్యతను పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అప్పగిస్తూ ఏకవాక్య తీర్మానం చేసి పంపారు. కానీ రాత్రి వరకు అధిష్ఠానం నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో పాటు పరిశీలకులను ఢిల్లీకి పిలిపించారు. దీంతో మాణిక్‌రావ్ ఠాక్రే, డి.కె.శివకుమార్ ఢిల్లీ వెళ్లి ఖర్గేను కలిశారు. సీఎల్పీ సమావేశ వివరాలను ఆయనకు నివేదించారు. మంగళవారం మరోసారి భేటీ అయి చర్చిద్దామని ఖర్గే వారికి సూచించినట్లు సమాచారం. ఆ సమావేశం అనంతరం విషయాన్ని సోనియాగాంధీ దృష్టికి తీసుకెళ్లి నిర్ణయాన్ని వెలువరించే అవకాశమున్నట్లు తెలిసింది. ఢిల్లీలోని ముఖ్యనేతలు పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఉన్న కారణంగా జాప్యం జరిగిందని, రేవంత్‌రెడ్డి పేరునే అధికారికంగా వెల్లడించనున్నారని కాంగ్రెస్ ముఖ్యనాయకుడొకరు తెలిపారు. రేవంత్‌రెడ్డి సోమవారం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారనే ప్రచారం జరిగినా, మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట రెడ్డి కూడా ఆ పదవికి పోటీ పడటంతో ఎమ్మెల్యేలతో విడివిడిగా చర్చించిన అంశాలతో కూడిన నివేదికను పరిశీలకులు అధిష్ఠానానికి పంపారు.

**మేమూ పోటీలో ఉన్నాం..**

సీఎం అభ్యర్థిని ఎన్నుకునేందుకు

- మిగతా 2వ పేజీలో



# జనంలో ఉందాం!

**ప్రజలకు సంబంధించిన అంశాలపై పోరాడుదాం..**
**ఓటమితో నిరాశ చెందకుండా ముందుకు సాగుదాం**
**ఇకపై తెలంగాణ భవన్ నుంచి కార్యకలాపాలు..**
**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలతో కేటీఆర్**

**హైదరాబాద్:** 'ప్రజలు వేరే పార్టీకి అవకాశం ఇచ్చినా మనకు గౌరవ ప్రదమైన స్థానాలు కట్టబెట్టారు. ప్రజలు మనకు ఇచ్చిన ప్రతిపక్ష పార్టీ బాధ్యతను విజయవంతంగా నిర్వహిద్దాం. ఓటమితో అధైర్య పడకుండా జనంలో ఉంటూ ప్రజలకు సంబంధించిన అంశాలపై పోరాడుదాం..'అని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు చేరుకున్న కేటీఆర్, బీఆర్ఎస్ తరఫున ఎన్నికైన ఎమ్మెల్యేలు, పార్టీ అభ్యర్థులు, సీనియర్ నేతలతో భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ కవిత కూడా నిజామాబాద్ జిల్లాకు చెందిన పార్టీ అభ్యర్థులు, ఇతర నేతలతో తెలంగాణ భవన్‌కు వచ్చారు. గెలుపొందిన ఎమ్మెల్యేలను కేటీఆర్ అభినందించారు. ఓటమి పాలైన అభ్యర్థులకు ధైర్యంగా ఉండి కలిసి పనిచేద్దామంటూ భరోసా ఇచ్చారు.

**ప్రజల నుంచి సానుకూల స్పందన**

'ఎన్నికల తర్వాత ప్రజల నుంచి మన పార్టీ నాయకత్వం విషయంలో ఒక సానుకూల స్పందన వస్తోంది. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోతుందని అనుకోలేదంటూ సమాజంలోని అన్ని వర్గాల నుంచి వందలాది మెసేజ్‌లు వస్తున్నాయి. తెలంగాణ బాగు కోరుకున్న అనేక మంది భావోద్వేగానికి గురవుతూ సందేశాలు పెడుతున్నారు. ఓటమితో నిరాశ చెందకుండా భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగుదాం. రెండు మూడురోజుల్లో పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో విస్తృత స్థాయి

- మిగతా 2వ పేజీలో



# కొత్త సర్కారుకు శ్రీకారం!

**నూతన ప్రభుత్వ ఏర్పాటు కోసం ప్రారంభమైన ప్రక్రియ**
**తాజాగా ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితాతో గెజిట్ ప్రకటన**
**రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలసి అందజేసిన**
**రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి**
**రెండో శాసనసభను రద్దుచేస్తూ గవర్నర్ ఉత్తర్వులు**
**కొత్త సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకారం**
**కోసం రాజ్‌భవన్‌లో ఏర్పాట్లు**

**హైదరాబాద్:** రాష్ట్రంలో నూతన ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభ ఏర్పాటు ప్రక్రియలో భాగంగా.. తాజా ఎన్నికల్లో గెలిచినవారి జాబితాతో కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి అవినాశ్ కుమార్, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ సోమవారం గెజిట్ జారీ చేశారు. ఆ వెంటనే సీఈఓ వికాస్‌రాజ్ రాజ్‌భవన్‌కు చేరుకుని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు గెజిట్ నోటిఫికేషన్ ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా సీఈఓ వికాస్‌రాజ్ నేతృత్వంలోని ఎన్నికల అధికారుల బృందం గవర్నర్ తమిళిసైతో కొంతసేపు మర్యాదపూర్వకంగా సమావేశమైంది.

**ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు:** అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేతను ఎన్నుకోవడానికి సోమవారం సమావేశమయ్యారు. సీఎల్పీ నేతగా రేవంత్‌రెడ్డి ఎన్నికవుతున్నారని, ఆయన రాజ్‌భవన్‌కు చేరుకుని సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని, మరో ఒకరిద్దరు మంత్రులుగా ప్రమాణం చేస్తారని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో రాజ్‌భవన్ ఉన్నతాధికారులు సోమవారం ఉదయమే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు ప్రారంభించారు. రాజ్‌భవన్ దర్బార్‌హాల్‌లో కొత్త సీఎం, మంత్రులతో గవర్నర్ తమిళిసై ప్రమాణ స్వీకారం చేయించడానికి వీలుగా పోడియంను, కార్యక్రమానికి వచ్చే ఆహ్వానితుల కోసం కుర్చీలను సిద్ధం చేశారు. దర్బార్ హాల్‌ను అలంకరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీర్మానం తీసుకుని సీఎల్పీ నేత రాజ్‌భవన్‌కు వచ్చే అవకాశం ఉండటంతో గవర్నర్ తమిళిసై, రాజ్‌భవన్ అధికారులు సాయంత్రం వరకు వేచిచూశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద

- మిగతా 2వ పేజీలో

# ప్రజాతీర్పును గౌరవిద్దాం..



**కొత్త సర్కారుకు సహకరిద్దాం**
**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కేసీఆర్**
**భవిష్యత్తులో ఏం జరుగుతుందో వేచి చూద్దాం**
**త్వరలో పార్టీ శాసనసభా పక్ష నేత ఎన్నిక**

**హైదరాబాద్:** 'రాష్ట్రంలో రాజ్యాంగబద్ధంగా జనవరి 16వ తేదీ వరకు మన ప్రభుత్వం కొనసాగే అవకాశమున్నా ప్రజల తీర్పును గౌరవిస్తూ హుందాగా తప్పుకున్నాం. ప్రజల తీర్పును గౌరవిస్తూ కొత్త ప్రభుత్వానికి సహకరిద్దాం. రాష్ట్ర రాజకీయాలు, పాలనలో భవిష్యత్తులో ఏం జరుగుతుందో వేచి చూద్దాం..'అంటూ భారత్ రాష్ట్ర సమితి అధినేత కె.చంద్రశేఖర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, పలువురు నేతలు కేసీఆర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ అధినేత ఆశీర్వాదం తీసుకున్నారు.

**త్వరలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం**

'త్వరలో తెలంగాణ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ఫలితాలపై సమీక్ష చేసుకుందాం. ఎన్నికల క్షేత్రంలో గెలుపోటములు అత్యంత సహజం. నిరాశ చెందకుండా ప్రజలతో మమేకమై వారి విశ్వాసాన్ని తిరిగి చూరగొనాల్సిన బాధ్యత నాయకులపైనే ఉంటుంది. అందువల్ల నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉండాలి. త్వరలో పార్టీ శాసనసభ పక్ష నాయకుడిని కూడా ఎన్నుకునేందుకు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకుందాం..'అని కేసీఆర్ ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్లకుపైగా సుస్థిర పాలన అందించి అభివృద్ధి, సంక్షేమంతో చెరగని ముద్ర వేసుకోగలిగామని సంతృప్తి వ్యక్తం చేశారు. అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలబెట్టడమేగాకుండా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందించి గొప్ప పరివర్తన తీసుకురాగలిగామన్నారు. బీఆర్ఎస్ అంటే ఒక భరోసా అనే విశ్వాసాన్ని కలిగించామని చెప్పారు. మెజారిటీ ఎంత వచ్చింది? ఎన్నిక ఏ విధంగా జరిగింది? ఏ తరహా పోటీని ఎదుర్కొన్నారు? లాంటి కొన్ని సాధారణ అంశాలను కూడా కేసీఆర్ ఆరా తీశారని ఆయనను కలిసిన నేతలు తెలిపారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన భేటీలో ఆయన కుశల ప్రశ్నలు సైతం వేసినట్లు చెప్పారు.

**హరీశ్, తదితరుల భేటీ**

ఉదయం పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమైన కేటీఆర్ ఫామ్ హౌస్ భేటీకి వెళ్లలేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇలా వుండగా ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి హరీశ్‌రావు కూడా కేసీఆర్‌ను కలిశారు. గజ్వేల్ ఎన్నికలో కేసీఆర్ ఎన్నికల ఏజెంట్‌గా వ్యవహరించిన అటవీ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప రెడ్డి 'ఎన్నిక ధ్రువీకరణ సర్టిఫికెట్'ను అందజేశారు. దుబ్బాక ఎన్నికల ప్రచారంలో కత్తిపోటుకు గురై కోలుకుంటున్న ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఆరోగ్య స్థితిపై కేసీఆర్ వాకబు చేశారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, శ్రీనివాస్ యాదవ్, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు కేసీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

**ప్రగతిభవన్ నుంచి ఫామ్‌హౌస్‌కు..**

కేసీఆర్ దంపతులు ఆదివారం రాత్రి ప్రగతిభవన్ నుంచి ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు కూడా ఒకటి రెండు రోజుల్లో బంజారాహిల్స్ నందినగర్‌లోని తన నివాసానికి మారనున్నారు. వ్యక్తిగత సామానును తరలించే పని జరుగుతున్నట్లు ప్రగతిభవన్ వర్గాలు వెల్లడించాయి. అయితే కేటీఆర్ జనవాడలోని ఫామ్‌హౌస్ నుంచి రాకపోకలు సాగించే అవకాశమున్నట్లు తెలిసింది.

## ఢిల్లీలో కేసీఆర్ అధికారిక నివాసం ఖాళీ

**రెండు దశాబ్దాలుగా ఆ ఇంటితో అనుబంధం**
**2, 3 రోజుల్లో పూర్తిగా తెగిపోనున్న బంధం**
**ఎంపీగా, సీఎంగా ఇదే బంగ్లాలో బస**

**న్యూఢిల్లీ:** రెండు దశాబ్దాలపాటు దేశ రాజధాని ఢిల్లీలో కేసీఆర్‌కు అధికారిక నివాసంగా కొనసాగిన తుగ్లక్ రోడ్‌లోని 3వ నంబరు ఇల్లును ఖాళీ చేస్తున్నారు. తెలంగాణలో జరిగిన


- మిగతా 2వ పేజీలో

## సీఎల్పీ నేతను అధిష్టానం ప్రకటిస్తుంది: భట్టి



**హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ శాసనసభా పక్షం (సీఎల్పీ) నేతను అధిష్టానం ప్రకటిస్తుందని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. ఈ విషయంలో వస్తున్నవి ఊహాగానాలు మాత్రమేనని, వాటిని నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. 'సోమవారం హైదరాబాద్‌లో సీఎల్పీ సమావేశం జరిగింది. సీఎల్పీ నాయకుడి ఎంపికను పార్టీ అధిష్టానానికి అప్పగిస్తూ ఈ సమావేశంలో ఏక వాక్య తీర్మానం చేసి పంపించాం. పార్టీ అధిష్టానం సీఎల్పీ నాయకుడిని ప్రకటిస్తుంది'అని భట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## నా ఓటమికి బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర: జీవన్‌రెడ్డి



**జగిత్యాల టౌన్:** బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటును బీజేపీ చీల్చడంతోనే తాను ఓటమి పాలయ్యానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పన్నిన కుట్రతోనే రాష్ట్రంలోని 15 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి పాలయ్యారని తెలిపారు. సోమవారం జగిత్యాలలోని ఇందిరాభవన్‌లో జీవన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంపై హర్షం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. కాంగ్రెస్‌ను అస్థిర పరిచేందుకు మాజీ సీఎం కేసీఆర్ కుట్ర చేస్తున్నారని, ఇందుకు కడియం శ్రీహరి వ్యాఖ్యలే నిదర్శనమని చెప్పారు. కేసీఆర్ కుట్రలకు కేంద్రంలోని మోదీ మద్దతిస్తున్నారని జీవన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో కేసీఆర్‌ను ఓడించినట్లుగానే కేంద్రంలో మోదీని ఇంటికి పంపాల్సిన సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. రాబోయే మూడు నెలల్లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేసి ప్రజలకు విశ్వాసం కల్పించాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర జలవనరుల శాఖ అనుమతి లేదని పేర్కొందని, సీడబ్ల్యూసీ అనుమతి లేకుండా ఫండింగ్ ఏజెన్సీలు రుణ సౌకర్యం ఎలా కల్పించాయో తెలియడం లేదని జీవన్‌రెడ్డి అనుమానం వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ కోటాలో మంత్రి పదవి రాబోతుందా? అన్న ప్రశ్నకు తానేనాడూ పదవుల కోసం పాకులాడలేదని, అదంతా అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. సమావేశంలో నాయకులు గిరి నాగభూషణం, శంకర్, నంద య్య, దుర్గయ్య, రాజేందర్, అశోక్, రాజేందర్, రఘువీర్‌గౌడ్, నేహాల్, చాంద్‌పాషా ఉన్నారు.

## నిర్మాణాత్మక ప్రతిపక్షపాత్ర పోషిస్తాం: అసదుద్దీన్



**హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న కాంగ్రెస్ పార్టీకి మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శుభాకాంక్షలు తెలిపారు. 7 అసెంబ్లీ స్థానా ల్లో విజయం సాధించిన మజ్లిస్ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని పేర్కొన్నా రు. మజ్లిస్ పార్టీకి ఓటు వేసి గెలిపించిన నగరవాసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## నామినేటెడ్ పదవులకు రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

పల్లె రవికుమార్‌గౌడ్ (కల్లుగీత కార్పొరేషన్), మేడె రాజీవ్‌సాగర్ (టీఎస్ ఫుడ్స్), డాక్టర్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ (గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ), గూడూరు ప్రవీణ్ (టెక్స్‌టైల్), గజ్జెల నగేష్ (బేవరేజెస్), అనిల్ కూర్మాచలం (ఫిలిం డెవలప్‌మెంట్), రామచంద్ర నాయక్ (ట్రైకార్), వలియా నాయక్ (గిరిజన ఆర్థిక సహకార సంస్థ), వై.సతీష్‌రెడ్డి (రెడ్‌కో), డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ (రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ), సర్దార్ రవీందర్‌సింగ్ (పౌర సరఫరాలు), జగన్మోహన్‌రావు (టెక్నాలజికల్ సర్వీసెస్), మన్నె క్రిశాంక్ (మినరల్ డెవలప్‌మెంట్) రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

**వైదొలిగిన ఎస్‌ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ రాధాకిషన్‌రావు:** మావోయిస్టు ఆపరేషన్స్‌లో కీలకమైన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్‌ఐబీ) చీఫ్‌గా పనిచేస్తున్న ఓఎస్‌డీ టి.ప్రభాకర్‌రావు సోమవారం తన పోస్టుకు రాజీనామా చేశారు. అలాగే, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీగా పనిచేసిన రాధాకిషన్‌రావు సైతం తన పోస్టుకు రాజీనామా చేశారు.

**ఏఏజీ రామచంద్రరావు రాజీనామా:** రాష్ట్ర అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు తన పదవికి రాజీనామా చేశారు. శాసనసభ ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఆయన తన రాజీనామాను సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపించారు. తొలిసారి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఆయన అదనపు ఏజీగా పనిచేశారు. అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ కూడా రాజీనామా చేయనున్నట్లు సమాచారం.

**ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ కూడా..:** తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు రాజీనామా చేస్తున్నట్టు రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పంపిన లేఖలో తెలిపారు. కొత్త సీఎండీలను నియమించే వరకు..జెన్‌కో సీఎండీగా ఆ సంస్థ డైరెక్టర్ ఎ.అజయ్‌కు, ట్రాన్స్‌కో సీఎండీగా సంస్థ జేఎండీ సి.శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు అప్పగించాలని ఆయన సిఫారసు చేశారు. అయితే ప్రభాకర్ రావు రాజీనామాను ఇంకా ఇంధన శాఖ ఆమోదించలేదని తెలిసింది. కాగా, ఏపీ నుంచి వచ్చిన విద్యుత్ ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇవ్వాల్సి రావడంతో ఏడాది కింద రివర్షన్లు పొందిన తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు ఎన్నికలైన వెంటనే పదోన్నతులు కల్పిస్తామని ప్రభాకర్‌రావు హామీనిచ్చారనీ, ఇప్పుడు ఆయన రాజీనామాతో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని బాధిత ఉద్యోగులు ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం అయినా తమకు న్యాయం చేయాలంటూ సోమవారం ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం సమర్పించారు.

## జనంలో ఉందాం!

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు వెళదాం. ప్రభుత్వంలో, అధికారంలో ఉన్నప్పుడు సచివాలయం, ప్రగతిభవన్ కేంద్రంగా విధులు, కార్యకలాపాలు కొనసాగించిన మనమంతా ఇకపై తెలంగాణ భవన్ కేంద్రంగా ప్రజలకు అందుబాటులో ఉందాం'అని కేటీఆర్ అన్నారు.

**నేతల భావోద్వేగం:** ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు, నేతలు భావోద్వేగానికి గురయ్యారు. సుమారు రెండు దశాబ్దాలకు పైగా పార్టీ అడుగుజాడల్లో నడిచిన తాము ఓటమిని జీర్ణించుకోలేక పోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 10 నియోజకవర్గాల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఫలితాలు తారుమారైన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ వివరించారు. పలువురు నేతలు కేటీఆర్, కవితతో ఫోటోలు దిగేందుకు పోటీలు పడ్డారు. వందలాది మంది తెలంగాణ భవన్‌కు తరలిరావడంతో పరిసరాలు సందడిగా కనిపించాయి. సుమారు మూడు గంటల పాటు తెలంగాణ భవన్‌లోనే గడిపిన కేటీఆర్ కొందరితో గ్రూపుగా, మరికొందరితో ముఖాముఖి సంభాషించారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబిత ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, మహమూద్ అలీతో పాటు ఎంపీ రంజిత్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, కృష్ణారావు, గోపీనాథ్, వివేకానంద, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## 27న సింగరేణి ఎన్నికలు

### మొత్తం ఓటర్లు 39,748 మంది.. జాబితా విడుదల..

### రిటర్నింగ్ అధికారితో నేతల సమావేశం.. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

**శ్రీరాంపూర్ (మంచిర్యాల), గోదావరిఖని, సింగరేణి (కొత్తగూడెం):** హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 27న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సోమవా రం హైదరాబాద్‌లోని డిప్యూటీ సీఎల్సీ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యా రు. మొత్తం 13 కార్మిక సంఘాల నాయకులు, కంపెనీ అధికారులు పాల్గొన్నారు. ఇప్పటివరకు ఎన్ని కల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల పర్వం, స్క్రూటి నీ పూర్తయిన విషయం తెలిసిందే. కోర్టుకు వెళ్లిన కారణంగా విడుదల చేయని ఓటరు జాబితాను కంపెనీ విడుదల చేసింది. జాబితా ప్రతుల ను రిటర్నింగ్ అధికారి కార్మిక సంఘాలకు అందజేశారు.

**8న తుదిజాబితా:** ఈనెల 6లోగా అభ్యంతరాలు స్వీకరిస్తారు. 8న తుదిజాబితా ప్రచురించనున్నారు. బీఆర్ఎస్ అను బంధ టీబీజీకేఎస్‌తోపాటు ఐదు జాతీయ కార్మిక సంఘాలు ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, బీఎంఎస్, సీఐటీయూ, ఏఐటీయూసీ సహా 13 సంఘాలు బరిలో ఉంటున్నాయి. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం కోసం ఒకే ఓటు పద్ధతి అమలు చేస్తారు. ఎన్నికల నిర్వహణకు ఆరు జిల్లాల కలెక్టర్ల ద్వారా రెవెన్యూ యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని కోరా రు. గుర్తులను రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు ఇప్పటికే కేటాయించారు. ఈ ఎన్నికల్లో 39748 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకో నున్నారు. శాశ్వత ఉద్యోగులు మాత్రమే ఓటు హ క్కు వినియోగించుకుంటారు. సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిన ఈనెల 27న పోలింగ్ నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి 7గంటల నుంచి ఓట్లు లెక్కిస్తారు. సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య, టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్, హెచ్ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, సీఐటీయూ కార్యదర్శి మంద నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

**ఏరియాల వారీగా ఓటర్లు:** బెల్లంపల్లి ఏరియాలో 985 మంది ఓటర్లు, మందమర్రిలో 4876, శ్రీరాంపూర్‌లో 9124, కార్పొరేట్‌లో 1192, కొత్తగూడెంలో 2370, మణుగూరులో 2414, ఎల్లందులో 603, నైనీబ్లాక్‌లో 2, భూపాలపల్లిలో 5350, ఆర్జీ 1లో 5430, ఆర్జీ 2లో 3479, అడ్రియాలాలో 944, ఆర్జీ 3లో 3063 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నెల ఒకటి నాటికి రిటైర్డ్ అయిన వారు పోనూ మొత్తం 39748మంది ఉన్నారు.

# ఓవర్ టు ఢిల్లీ..!

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం ఉదయం 9.30 గంటలకు గచ్చిబౌలిలోని ఓ హోటల్‌లో సమా వేశం ఏర్పాటు చేశారు. పరిశీలకులుగా డి.కె.శివకు మార్, బోసురాజు, అజయ్‌కుమార్, జార్జి, దీపా దాస్ మున్షీలను కాంగ్రెస్ అధిష్ఠానం నియమించింది. సీఎల్పీ సమావేశానికి ముందే మరో హోటల్‌లో బస చేసిన డి.కె.శివకుమార్‌తో భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి సోదరులు సమావేశమయ్యారు. వీరిలో కొందరు తమకు అవకాశమివ్వాలని కోరుతూ అందుకు గల కారణాలను నివేదించినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రులుగా ఇద్దరు కాకుండా ఒక్కరే ఉండాలని ఒక నాయకుడు సూచించినట్లు తెలిసింది. సమావేశంలో పాల్గొన్న ఒకరి పేరు స్పీకర్ పదవికి చర్చకు రాగా.. ఆయన తిరస్కరించినట్లు తెలిసింది.

### అధిష్ఠానానికి అప్పగిస్తూ తీర్మానం

శివకుమార్ ఇక్కడ చర్చ ముగిసిన తర్వాత ఎమ్మెల్యేలు బస చేసిన హోటల్‌కు వెళ్లారు. ఎమ్మెల్యేలందరి అభిప్రాయాలను పరిశీలకులు విడివిడిగా తెలుసుకున్నారు. సీఎం అభ్యర్థిగా ఒక్కరి పేరే చెప్పాలని సూచించారు. ఈ ప్రక్రియలో కొందరు ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డి పేరు చెప్పగా.. మరికొందరు భట్టి, ఉత్తమ్, కోమటిరెడ్డిల పేర్లు చెప్పినట్లు తెలిసింది. ఏడెనిమిది మంది ఎమ్మెల్యేలు ఖమ్మం జిల్లాకు చెందిన మరో నాయకుడి పేరు చెబుతూనే.. అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని పేర్కొన్నట్లు తెలిసింది. కొందరు రాహుల్‌గాంధీ నిర్ణయమే శిరోధార్యమని చెప్పినట్లు సమాచారం. ఈ భిన్నాభిప్రాయాలతోపాటు.. ముగ్గురు సీనియర్ నాయకులు తమకే అవకాశం కల్పించాలని గట్టిగా కోరడం, కొందరు సీనియర్లు రేవంత్‌రెడ్డిని వ్యతిరేకించడంతో పరిశీలకులకు సందిగ్ధత ఎదురైంది. దీంతో అభ్యర్థి ఎంపిక బాధ్యతను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి అప్పగిస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ ఏకవాక్య తీర్మానాన్ని భట్టి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, పొన్నం ప్రభాకర్‌తో సహా ఎనిమిది మంది బలపరిచినట్లు సమావేశం అనంతరం డి.కె.శివకుమార్ విలేకరులకు తెలిపారు. పార్టీకి విజయాన్ని చేకూర్చిన తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు చెబుతూ ఇంకో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో పాటు మురళీధరన్, మునియప్ప, రోహిత్‌చౌదరి తదితరులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### ప్రమాణ స్వీకారానికి సన్నద్ధం చేసినా..

రాజ్‌భవన్‌లో సోమవారం మధ్యాహ్నం నుంచే ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు ప్రారంభయ్యాయి. రెండో శాసనసభను రద్దు చేస్తూ గవర్నర్ నోటిఫికేషన్ జారీ చేయడం, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితాను సీఈవో వికాస్‌రాజ్ గవర్నర్‌కు సమర్పించడంతోపాటు గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ కావడంతో కొత్త మంత్రివర్గం ప్రమాణం చేయడానికి మార్గం ఏర్పడింది. సీఎల్పీ సమావేశం తర్వాత ఫలానా వ్యక్తిని నాయకుడిగా ఎన్నుకున్నామని, ప్రమాణ స్వీకారానికి అనుమతించాలని గవర్నర్‌కు లేఖ పంపాల్సి ఉంటుంది. ఆ తర్వాత సీఎం డిజిగ్నేట్‌గా ఆ వ్యక్తిని పేర్కొంటూ గవర్నర్ లేఖ జారీ చేశాక.. ప్రమాణ స్వీకారాన్ని నిర్వహిస్తారు. ఆ కార్యక్రమం సోమవారం రాత్రి 8- 8.30 గంటల మధ్యలో నిర్వహిస్తున్నట్లు సాధారణ పరిపాలన శాఖ నుంచి కొందరు ఎమ్మెల్యేలకు ఫోన్లు కూడా వెళ్లాయి. కానీ కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి సమాచారం రాకపోవడంతో వాయిదా పడింది.



### రేవంత్‌రెడ్డి నివాసం వద్ద భద్రత పెంపు

**జూబ్లీహిల్స్:** పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నివాసం వద్ద పోలీసులు భద్రత పెంచారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం, ముఖ్యమంత్రి పదవి రేసులో ఆయన ఉండటంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో ఆయన నివాసానికి తరలివస్తుండటంతో వారిని అదుపు చేసేందుకు, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జూబ్లీహిల్స్ పోలీసులు ఇక్కడ రెండు ప్లటూన్‌ల సిబ్బందిని ఏర్పాటు చేశారు. వీరితోపాటు ఒక ఎస్సై, మరికొంత మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. సాయుధ సిబ్బందిని సైతం ఏర్పాటు చేశారు. రేవంత్ నివాసానికి వెళ్లే దారిలో బారికేడ్లు ఏర్పాటు చేసి తనిఖీ అనంతరమే అనుమతిస్తున్నారు. మరోవైపు జీహెచ్ఎంసీ సిబ్బంది సైతం గతంలో ఎన్నడూ లేని విధంగా ఇక్కడి దారులను శుభ్రం చేస్తున్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాకపోకలు సాగించే దారుల్లో ఉన్న సమస్యలను పరిశీలిస్తున్నారు. ఎలాంటి అవరోధాలు లేకుండా చర్యలు చేపడుతున్నారు.

# కొత్త సర్కారుకు శ్రీకారం!

(మొదటి పేజీ తరువాయి)

సంఖ్యలో రాజ్‌భవన్ వద్దకు చేరుకోవడంతో సందడి నెలకొంది.

**కాన్వాయ్‌లనూ సిద్ధం చేసినా..:** కొత్త సీఎం, మంత్రులు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ప్రొటోకాల్ ప్రకారం వారికి ప్రత్యేక కాన్వాయ్‌ల కోసం కూడా ఏర్పాట్లు జరిగాయి. రాజ్‌భవన్ పక్కనే ఉన్న దిల్‌కుషా అతిథి గృహం వద్ద ఈ మేరకు వాహనాలను సిద్ధంగా ఉంచారు. అయితే సీఎల్పీ నేత ఎంపిక విషయంలో ఏకాభిప్రాయం రాలేదని, కొత్త సీఎం ప్రమాణ స్వీకారం సోమవారం ఉండదనే స్పష్టత రావడంతో జీఏడీ అధికారులు రాజ్‌భవన్ నుంచి వెనుతిరిగారు.

**కొత్త కొత్తగా సచివాలయం:** నూతన సీఎం, మంత్రులకు రాష్ట్ర సచివాలయంలో ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నా రు. సచివాలయంలో పాత ప్రభుత్వంలోని కీలక ప్రజాప్రతినిధుల నేమ్ ప్లేట్లను అధికారులు సోమ వారం తొలగించారు. కొత్త సీఎం, మంత్రుల కోసం చాంబర్లను సిద్ధం చేస్తున్నారు. కొత్త సీఎం, మంత్రులకు సంబంధించి తమకు ఎలాంటి కబురు అందలేదని, అధికారికంగా సమాచారం అందగానే వారి కి సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని సాధారణ పరిపాలన విభాగం అధికారులు తెలిపారు.

**అసెంబ్లీ కూడా ముస్తాబు:** కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక త్వరలోనే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి, కొత్తగా ఎన్నికైన వారితో ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీని కూడా ముస్తాబు చేస్తున్నారు. అసెంబ్లీ భవనానికి రంగులు వేయడంతోపాటు పాత ఫర్నీచర్‌ను తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. మంత్రులు, సీఎం



చాంబర్లను అందంగా తీర్చిదిద్దే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

**తెలంగాణ రెండో శాసనసభ రద్దు:** కేసీఆర్ నేతృత్వంలోని మంత్రివర్గం సిఫార్సు మేరకు తెలంగాణ రాష్ట్ర రెండో శాసన సభను రద్దు చేస్తూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సోమ వారం ఉత్తర్వులు జారీ చేశారు. రద్దు ఉత్తర్వులు ఆదివారం (డిసెంబర్ 3) మధ్యాహ్నం నుంచే వర్తిస్తాయని పేర్కొన్నారు.

### అసెంబ్లీ ఎన్నికల కోడ్ ఉపసంహరణ

**హైదరాబాద్:** శాసనసభ సాధారణ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనానియమావళి అమలును కేంద్ర ఎన్నికల సంఘం ఉపసంహరించుకుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అజయ్‌కుమార్ వర్మ సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో)కు లేఖ రాశారు. తక్షణమే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. అక్టోబర్ 9న రాష్ట్ర శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన నాటి నుంచి రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనానియమావళి అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే.



## ఢిల్లీలో కేసీఆర్ అధికారిక నివాసం ఖాళీ

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హస్తినలోని కేసీఆర్ అధికారిక నివాసాన్ని ఇక్కడి సిబ్బంది ఖాళీ చేస్తున్నారు. ఇప్పటికే కొంత సామాను తరలించిన సిబ్బంది.. రెండు మూడు రోజుల్లో ఈ ఇంటిని పూర్తిగా ఖాళీ చేయనున్నారు. లోక్‌సభ సభ్యుడిగా ఉన్న సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం చంద్రశేఖర్‌రావుకు ఈ బంగ్లాను కేటాయించింది. అప్పటి నుంచి ఆయనకు ఇది అధికారిక నివాసంగా మారింది. ఈ ఇంటి నుంచే హస్తినలో ఆయన తెలంగాణ ప్రత్యేక రాష్ట సాధన ఉద్యమాన్ని నడిపించారు. రాష్ట్ర సాధన అనంతరం రెండు పర్యాయాలు కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. సీఎం హోదాలో హస్తినకు ఎప్పుడు వచ్చినా ఇదే ఇంట్లో ఆయన బస చేసేవారు. అధికారం కోల్పోయిన ఏ ప్రజా ప్రతినిధి అయినా.. అధికారిక నివాసాన్ని ఖాళీ చేయడానికి నెల రోజుల సమయం ఉంటుంది. కానీ.. కేసీఆర్ ఆదేశాల మేరకు ఆ ఇంటిని రెండు మూడు రోజుల్లోనే పూర్తిగా ఖాళీ చేయనున్నారు.

# అత్యధిక ఎంపీ సీట్లలో గెలుపే లక్ష్యం

### వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్నాం

### బీఆర్ఎస్‌పై మా పోరాటం

### కాంగ్రెస్‌కు లాభం చేకూర్చింది

### మీడియాతో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి

**హైదరాబాద్:** వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి అత్యధిక ఎంపీ సీట్లలో గెలుపే లక్ష్యంగా ముందుకెళతామని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషర్షన్‌రెడ్డి తెలిపారు. కలిసికట్టుగా ముందుకుసాగుతూ తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ పార్టీగా ఎదిగేలా పోరాడుతామన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిరాశ పరిచినా మరింత గట్టిగా పోరాడి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 80 సీట్లు సాధించేలా ఇప్పటి నుంచే పట్టుదలతో కృషి ప్రారంభిస్తామని చెప్పారు. ఎంతో కష్టపడినా అనుకున్న స్థాయిలో ఫలితాలు రాలేదని, ఈ ఎన్నికల్లో బీజేపీ 8 స్థానాల్లో విజయం సాధించిందని, 7 నుంచి 14 శాతానికి ఓటు బ్యాంకు పెరిగిందన్నారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే 100 శాతం ఓటింగ్ పెరిగిందని చెప్పారు. పార్టీ నేతలు కాసం వెంకటేశ్వర్లు యాదవ్, ప్రేంసింగ్‌రాథోడ్, చింతా సాంబమూర్తి, ప్రకాష్‌రెడ్డి తదితరులతో కలిసి కిషన్‌రెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడారు. ఓడిన స్థానాలపై జాతీయస్థాయి నుంచి జిల్లా, మండల, బూత్ స్థాయి వరకు సమీక్ష జరిపి వచ్చే లోక్‌సభ ఎన్నికలకల్లా లోటుపాట్లను సరిదిద్దుకుంటామని చెప్పారు.

**లోక్‌సభకు ఓటేస్తామన్నారు:** అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి బీజేపీ నేతలు వెళ్లినప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు మద్దతు తెలిపే ఓటర్లు తాము అసెంబ్లీకి ఎవరికి ఓటేసినా పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం బీజేపీకి వేస్తామని చెప్పారన్నారు. తాము గెలిచింది 8 స్థానాలే అయినా, 80 మంది ఎమ్మెల్యేల బలాన్ని ప్రజలు ఇచ్చారని చెప్పారు. క్రియాశీల ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషిస్తామని, ప్రజల పక్షాన నిలబడి పోరాడతామని తెలి



పారు. అధికార బీఆర్ఎస్‌పై ఐదేళ్లుగా బీజేపీ సాగించిన పోరు వల్ల కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో లాభం పొందిందన్నా రు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై గట్టిగా పోరాడుతూ రాష్ట్రంలో ఆ పార్టీకి ప్రత్యామ్నాయంగా మారేందుకు కృషి చేస్తామన్నారు. బీజేపీపై పడి ఏడ్చి బురదచల్లిన వారు ఈ రోజు ఫామ్‌హౌస్‌కు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని (మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి) వ్యాఖ్యానించారు.

### అక్కడ కాంగ్రెస్‌కు ఆ పరిస్థితి లేదు

కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ఉన్న పరిస్థితి ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో లేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నా రు. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారాన్ని బీజేపీ చేజిక్కించుకుందని, మధ్యప్రదేశ్‌లో గతంలో కంటే ఎక్కువ మెజారిటీ సాధించిందని చెప్పారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్, సీఎం అభ్యర్థి అని చెబుతున్న రేవంత్‌రెడ్డిని బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఓడించి రికార్డు సృష్టించారన్నారు. ఇలాంటి రికార్డు దేశంలో మరే రాష్ట్రంలోనూ సాధ్యం కాలేదన్నారు. పార్టీ పోటీచేసిన స్థానాల్లో ఓటమికి దారి తీసిన కారణాలను విశ్లేషించుకుంటామని, ఢిల్లీ వెళ్లి జాతీయ నాయకత్వంతో సమావేశమై రాష్ట్రంలో ఎన్నికల సరళి, ప్రభావం చూపిన అంశాలు, తదితర విషయాలపై చర్చిస్తామని చెప్పారు. పార్లమెంట్ సమావేశాలు, రాబో యే లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కావడం, తెలంగాణ ఎన్నికల తీరుతెన్నులపై సవివరంగా తెలియజేస్తామన్నారు. తమ పార్టీ వారే తనను ఓడించారని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఒక విలేకరి ప్రస్తావించగా, ఆ వ్యాఖ్యలు తన దృష్టికి రాలేదని కిషన్‌రెడ్డి సమాధానమిచ్చారు.

## బీఆర్ఎస్, మజ్లిస్ కుట్రలను తిప్పికొట్టారు: కిషన్‌రెడ్డి

### రాజాసింగ్ నివాసానికి వెళ్లి అభినందించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

**హైదరాబాద్:** శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల అధినేతలు కేసీఆర్, అసదుద్దీన్ ఎన్ని కుట్రలు చేసినా ఎమ్మెల్యే రాజాసింగ్ బలమైన విశ్వాసం, ధైర్యంతో తిప్పికొట్టారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రశంసించారు. ముఖ్యంగా మజ్లిస్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం కొనసాగిస్తూ, ప్రజల ఆశీస్సులతో రాజాసింగ్ మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారని అన్నారు. అధికార దుర్వినియోగం, కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టినా గోషామహల్‌లో ధర్మం, జాతీయ భావజాలమే గెలిచిందని పేర్కొన్నారు. సోమవారం గోషామహల్‌లో రాజా సింగ్ నివాసానికి వెళ్లిన కిషన్‌రెడ్డి ఆయనను అభినందించారు. తప్పుడు ప్రచారాలతో అనేక శక్తులు పన్ని న కుట్రలను ఎదుర్కొని బీజేపీ ఎమ్మెల్యేగా రాజాసింగ్‌ను గెలిపించిన గోషామహల్ ప్రజలకు, ఆయన విజయం కోసం పనిచేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. రానున్నరోజుల్లో పార్టీ మరింత విస్తరణకు రాజాసింగ్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా వినియోగించుకుంటామన్నారు. 2024 ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ విజయం కోసం కృషి చేస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు.

## ఉస్మానియా యూనివర్సిటీలో
# ప్రజాస్వామ్య వాతావరణాన్ని పునరుద్ధరించాలి

**ఓయూ విద్యార్థి సంఘాలు**



సికింద్రాబాద్, డిసెంబర్ 04 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని పునరుద్ధరించాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం యూనివర్సిటీ వీసీ ని కలిసి వినతి పత్రం అందించారు. వినతి పత్రం అందించడానికి వెళ్లిన విద్యార్థులను బి సెక్యూర్ సెక్యూరిటీ సిబ్బంది లోనికి వెళ్ళడానికి నిరాకరించడంతో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.

అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ గేట్లను, బారికేడ్లను తొలగించిన విద్యార్థి నాయకులు వీసీ చాంబర్లోకి దూసుకెళ్లారు. అనంతరం వీసీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి నాయకులు మాట్లాడుతూ... వీసీ తీసుకున్న విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించడానికి ఓయూ విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత యూనివర్సిటీలో సభలు సమావేశాలు పెట్టుకునే వాతావరణాన్ని లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దొరల పాలన అంతం అయిందని, ఇప్పటికైనా యూనివర్సిటీలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. పెంచిన అన్ని కోర్సుల ఫీజులను తగ్గించాలన్నారు. యూనివర్సిటీలో భారీకేడ్లను ముళ్లకంచెలను వెంటనే తొలగించాలన్నారు. బి సెక్యూర్ ఏజెన్సీని రద్దుచేసి అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న స్థానికులైన తెలంగాణ కార్మికులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. విద్యార్థుల ప్రధాన్యత దృష్ట్యా ఆర్టీసీ బస్సులను యూనివర్సిటీలోకి అనుమతించాలని కోరారు.

వినతి పత్రం ఇచ్చిన వారిలో విద్యార్థి సంఘ నాయకులు కోట శ్రీనివాస్, బాల లక్ష్మి, గ్యార నరేష్, నెల్లి సత్య, ఇరిగి లెనిన్, పెంచాల సతీష్, వలిగొండ నరసింహ, సమీర్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

---


## అభివృద్ధిలో ఎల్బీనగర్ ను అగ్రభాగాన నిలుపుతా : సుధీర్ రెడ్డి

**ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని ఘనంగా సత్కరించిన పార్టీ శ్రేణులు**



ఎల్బీనగర్, వాయిస్ టుడే: ఎల్బీనగర్ ఎమ్మెల్యేగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మూడోసారి గెలుపొందారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సంబురాలను జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఎల్బీనగర్ నియోజకవర్గం హస్తినాపురంలోని జి.ఎస్.ఆర్. కన్వెన్షన్ హాల్లో కార్యకర్తలు సన్మాన సభను నిర్వహించారు. ఈ సభలో పార్టీ శ్రేణులు, అభిమానులు తీసుకొచ్చిన పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ తనను ఓడించడానికి ప్రతిపక్షాలు ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేశాయని, వాటిని ప్రజలు తిప్పికొట్టి తనను భారీ మెజారిటీతో గెలిపించారని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సతీమణి కమలా సుధీర్ రెడ్డి, సీనియర్ నాయకులు గజ్జల మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## గుజరాతి ఏక్త మహోత్సవాలను నిర్వహించుకున్నా గుజరాతీలు



కంటోన్మెంట్, డిసెంబర్ 4 (వాయిస్ టుడే ప్రతినిధి) తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ సమీపంలో ఆరు లక్షల మంది గుజరాతీయులు నివసిస్తున్నారని గుజరాతీ ప్రతినిధులు తెలిపారు ఆదివారం నాడు సికింద్రాబాద్ కంఠం నియోజకవర్గం లోని మూడో వార్డులో ఇంపీరియల్ గార్డెన్లో గుజరాతి ఏక్త మహోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గుజరాతి ప్రతినిధులు మాట్లాడుతూ మార్వాడీ లోని వివిధ కులాల ప్రతినిధులమంతా వ్యాపారాలు చేసుకుంటామని అందులో భాగంగానే వివిధ సాంస్కృతిక సాంప్రదాయాలు క్రీడల పట్ల పిల్లలకు అవగాహన కల్పిస్తూ ఉన్నత చదువులు చదివిస్తూ పెద్దవారు వివిధ వ్యాపారాలలో ముందుకు వెళ్లాలని ఇలాంటి మహోత్సవాలను జరుపుకుంటామని తెలియజేశారు విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు గెలుపొందిన వారికి బహుమతులను కూడా అందజేశారు గుజరాతీల పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో ప్రేమల పరిక, చందు బాయ్ పటేల్, చేతన్ బోగిని, మినల్ వకారియా, తదితరులు గుజరాతీయులు కుటుంబ సభ్యులతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సుధీర్ రెడ్డికి పలువురి సత్కారం

**భారీగా తరలివస్తున్న పార్టీ అభిమానులు**



ఎల్బీనగర్, వాయిస్ టుడే: ఎల్బీనగర్ నియోజకవర్గ శాసనసభ్యులుగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మరోసారి విజయం సాధించడంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వికలాంగులు తదితరులు తరలివచ్చి సుధీర్ రెడ్డికి పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ఎమ్మెల్యే లాస్యకు స్నేహితుల సత్కారం



కంటోన్మెంట్, డిసెంబర్ 4 (వాయిస్ టుడే ప్రతినిధి) సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించిన లాస్య నందితకు కారా?నాలోని ఎమ్మెల్యే నివాసానికి ఆమె చిన్ననాటి మిత్రులు కలిసి భారీ గజమాలతో సన్మానించారు తమ స్నేహితురాలు ఎమ్మెల్యే కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు అనంతరం ఎమ్మెల్యే స్నేహితులతో సరదాగా కాసేపు గడిపారు.

---





## విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్న మిద్దెల జితేందర్

ఎల్బీనగర్, వాయిస్ టుడే: రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో హైదరాబాద్ గాంధీభవన్ వద్ద సంబురాలు జరిగాయి. గాంధీభవన్ వద్ద జరిగిన విజయోత్సవ వేడుకలకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మిద్దెల జితేందర్ మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎనలేని కృషి చేస్తుందని తెలిపారు. పేదల కోసం గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి తిరిగి ప్రజలు కాంగ్రెస్ కు పట్టం కట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై న్యాయపోరాటం చేస్తా శ్రీ గణేష్



కంటోన్మెంట్, డిసెంబర్ 4 (వాయిస్ టుడే ప్రతినిధి) సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం పికెట్ పార్టీ కార్యాలయంలో బిజెపి అభ్యర్థి శ్రీ గణేష్ మాట్లాడుతూ ప్రజాతీర్పుణ శిరసా వహిస్తున్నాను అని ఎన్నికల్లో గెలుపు ఓటమి లు సహజమే అని అన్నారు బిజెపి నాయకులు కార్యకర్తలు నా గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారని తెలిపారు ఓట్లు వేసిన 42 వేల ప్రజలకు బిజెపి తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు కంటోన్మెంట్ ప్రజల ఆకాంక్షల కొరకు బిజెపి పని చేస్తుందని తెలిపారు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజలను ప్రలోభాలకు గురిచేసారని. సంక్షేమ పథకాలను కట్ చేస్తానని బెదిరించారుఅని వారు అన్నారు పోలింగ్ ముందు ఎలక్షన్ కోడ్ ను ఉల్లంఘించి నాపై తప్పుడు ఆరోపణలు చేశారని నాపై ఏ ఆధారం లేకుండా తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై న్యాయపోరాటం చేస్తానని తెలిపారు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా కంటోన్మెంట్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు శ్రీ గణేష్.

## భగవంతుడి ఆశీస్సులు ఎల్లవేళలా మీపై ఉంటాయి : హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ

**వివేకానంద కి ఆశీస్సులు అందించిన పలు దేవాలయాలకు చెందిన ప్రముఖ అర్చకులు**



కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (నవంబర్ 04) : ప్రజల మద్దతుతో అఖండ విజయాన్ని అందుకుని హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నిలిచిన కేపీ.వివేకానంద కి రాష్ట్రంలోని పలు దేవాలయాలకు చెందిన ప్రధాన అర్చకులు ఈరోజు ఉదయం కుత్బుల్లాపూర్ లోని నివాసంలో జరిగిన కార్యక్రమంలో వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ 16వ వార్డ్ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజ్ యాదవ్ వారి మిత్రబృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

---

# అన్ని దానాలలోకెల్లా అన్నదానం గొప్పది

**ఆలయంలో నిత్య అన్నదానానికై రూ. 1,00,111 విరాళం అందించిన పుప్పాల అజయ్ కుమార్**



హైదరాబాద్ : నవంబర్ 4(వాయిస్ టుడే) శ్రీ క్షేత్ర గంగాపూర్ గుల్బర్గ ఆలయంలో భక్తులకు నిత్యాదానం కార్యక్రమాన్ని నిరవధికంగా కొనసాగింపు లో భాగంగా పాతబస్తీ ఛత్రినాక నివాసి పుప్పాల అజయ్ కుమార్ రూ. 1,00,111 విరాళంగా అందించారు. ఆయన శ్రీ దత్తాత్రేయ అన్నదానం ట్రస్ట్ శ్రీమహాదేవ్ ఆఫీస్ మేనేజర్ శ్రీ కులకర్ణికి చెక్కును అందించి తన సహృదయతను చాటుకున్నారు. ఇదివరకు తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో ఆలయాల్లో జరుగుతున్న నిత్యాదాన స్కీం కింద భక్తులకు నిరంతర ప్రక్రియాగా భోజనాలు సమకూర్చేందుకు తన దాతృత్వాన్ని చాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్న అన్నదానం గొప్పదని, ఆలయ ప్రాంగణంలో భక్తులకు నిత్యం అన్నదానం అందించటం మహత్తర కార్యమన్నారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వదించి తన జీవితంలో ఎన్నో ఉన్నత శిఖరాలను అధరోహించాలని మనసారా ఆశీర్వదించి తీర్ధ ప్రసాదాలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలోప్రభుత్వ మల్లేపల్లి ఐటిఐ ప్రిన్సిపాల్ పుప్పాల జ్యోతిరాణి, డాక్టర్ యశ్వంత్ రావు దిగంబర్జీలు పాల్గొన్నారు.

# "అభిమాన నాయకుడి"కి అభినందనల వెల్లువ



కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (డిసెంబర్ 04) : చరిత్రను తిరగరాస్తూ 85576 ఓట్ల మెజారిటీతో నూతన రికార్డులను సృష్టించి రాజకీయ చదరంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించుకున్న కుత్బుల్లాపూర్ అభివృద్ధి ప్రదాత, హ్యాట్రిక్ వీరుడు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద కి శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాసం వద్దకు భారీ సంఖ్యలో చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్నా శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీలు చినంగి వెంకటేశం ముదిరాజ్, సన్న కవితా శ్రీశైలం యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బూర్గుబావి హనుమంతరావు, కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని గజమాలలో, శాలువాలతో ఎమ్మెల్యే కేపీ వివేకానందకి శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఎమ్మెల్యే కేపీ వివేకానంద కి శుభాకాంక్షలు తెలిపిన శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (డిసెంబర్ 04) : కుత్బుల్లాపూర్ ప్రజల ఆమోదంతో ముచ్చటగా మూడవసారి హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద కి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద కి శుభాకాంక్షలు తెలిపిన వారిలో పలువురు కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## కార్పొరేటర్ రావుల శేషగిరి ఆధ్వర్యంలో సంబరాలు

కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (డిసెంబర్ 04) : గాజులరామారం రోడ మేస్త్రి నగర్ బి పరిధిలో షమీం ఆప ఆధ్వర్యంలో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా కేపీ వివేకానంద విజయం సాధించిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న 125 డివిజన్ గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, వారితోపాటు డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రషీద్ బేగ్, నవాబ్ భాయి, మల్లేష్, పతి శ్రీనివాస్, సింగారం మల్లేష్, మురళీకృష్ణ, డివిజన్ బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పద్మారావు గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత



సికింద్రాబాద్ డిసెంబర్ 04 (వాయిస్ టుడే ప్రతినిధి): సికింద్రాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలుపొందిన తీగుళ్ల పద్మారావు గౌడ్ ని సోమవారం రోజు వారి నివాసం వద్ద బీ ఆర్ ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు శ్రీ మోతె శోభన్ రెడ్డి తో కలిసి గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు, అలాగే గ్రేటర్ పరిధిలో గెలుపొందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు డిప్యూటీ మేయర్ శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు: శేఖర్ గౌడ్



వాయిస్ టుడే : నవంబర్ 4(వాయిస్ టుడే)దతెలంగాణ రాష్ట్రములో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో కూకట్పల్లి నియోజకవర్గం మూసాపేట్ లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విజయదుందుభి మోగిస్తూ పార్టీ కార్యకర్తలందరూ ఆనందోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.మూసాపేట్ లోని రామచర్ల శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బాణాసంచా పేల్చి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో దాదె కిరణ్, జిల్ల శంకర్, కృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు తెలిపిన చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి



కూకట్పల్లి : నవంబర్ 4(వాయిస్ టుడే) శేరిలంగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి అరికెపుడి గాంధీ భారీ మెజారిటీతో హాట్రిక్ విజయం సాధించడంతో మంగళవారం పాపిరెడ్డి నగర్ కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో గాంధీ నివాసానికి బయలుదేరి ఆరికేపూడి ని పుష్ప గుచ్చాన్ని అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే గాంధీ చేసిన అభివృద్ధి పనులే గెలిపించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి భూపాల్ రెడ్డి, మాయ రాజయ్య, ఈరెడ్డి దేవేందర్ రెడ్డి, చిట్టిరెడ్డి గోపాల్ రెడ్డి, బాలనర్సయ్య, ఎడ్ల సంపత్ రెడ్డి, రాజనర్సింహ రెడ్డి, సునీల్, దాకురీ అక్కి రెడ్డి, స్వామి, మహేందర్ రెడ్డి, సాయి బాబా, రామకృష్ణా రెడ్డి, నాగరాజు, బాలశౌరి, లక్ష్మణ్ మేస్త్రి, మల్లేశ్, రాజి రెడ్డి, రవి మరియు ఇతర నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాసనసభ ఎన్నికలలో అనేక అవకతవకలు: జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకులు



జూబ్లీహిల్స్ డిసెంబర్ 4( వాయిస్ టుడే ) యూసుఫ్ గూడా కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో డిసెంబర్ మూడవ తేదీ నా జరిగే జూబ్లీహిల్స్ నియోజకవర్గం శాసనసభ ఎన్నికలలో అనేక అవకతవకలు జరిగాయని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కౌంటింగ్ సమయంలో ఈవీఎంల పై నంబర్లు కూడా లేవని తమకు ఈ విషయంపై అనుమానం కలుగుతోందని రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మరియు కాంగ్రెస్ నాయకుడు భవనిశంకర్ ఆరోపించారు. కొన్ని ఈవీఎంలకు సీల్ లేకపోవడంతో పాటు వాటికి ఉన్న నంబర్లు సరితూగలేదన్నారు.

అభ్యర్థి అజారుద్దీన్ ఫిర్యాదును కూడా పట్టించుకోకుండా హడావుడిగా కౌంటింగ్ ను పూర్తి చేశారన్నారు. తాము ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు పేర్కొన్నారు. రీ ఎలక్షన్ జరిగేలా కాంగ్రెస్ కోరుతోందని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిరాశను దరి చేరనీయం..మా లక్ష్యం కోసం పనిచేస్తాం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క బీజేపీకే ఓటింగ్ శాతం పెరిగిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. దాదాపు 14 శాతం ఓటు బ్యాంకును కైవసం చేసుకున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత శాసనసభ ఎన్నికలతో పోలిస్తే తమ ఓటు బ్యాంక్ 100 శాతం పెరిగింది. 8 స్థానాల్లో విజయం సాధించాం. పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చేందుకు కృషి చేస్తాం. కాంగ్రెస్, భారాస పెద్దఎత్తున డబ్బులు ఖర్చు చేసింది. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీకి పెద్ద మెజారిటీ ఇవ్వలేదు. కామారెడ్డిలో ముఖ్యమంత్రి, కాబోయే ముఖ్యమంత్రిని ఓడించి చరిత్ర సృష్టించాం. వెంకట రమణారెడ్డి ఐదేళ్ల పోరాటమే ఈ ఫలితాన్ని ఇచ్చింది. కామారెడ్డి ఫలితం పట్ల జాతీయ నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. 2024 కేంద్రంలో అధికారంలోకి వచ్చి మోదీ హ్యాట్రిక్ సృష్టిస్తారు. నిరాశను దరి చేరనీయకుండా పట్టుదలతో మా లక్ష్యం కోసం ముందుకు సాగుతాం. అధికార కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ భవిష్యత్ కార్యాచరణ ఉంటుంది. ఈ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తాం. వచ్చే ఐదేళ్లు క్రియాశీల, నిర్మాణాత్మక ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషిస్తాం. కేంద్రం, భాజపాపై తప్పుడు ప్రచారం చేసిన వాళ్లు ఫామ్ హౌస్‌కు వెళ్లారు. ఇవాళ దిల్లీకి వెళ్లి అధిష్ఠానానికి అన్ని విషయాలు వివరిస్తా. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు దేశ భవిష్యత్‌ను నిర్ణయించేవి. పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రతి ఒక్కరి సహాయం తీసుకుంటామని కిషన్ రెడ్డి వెల్లడించారు.

# మా టాలెంట్ ని గుర్తించండి...

**డిసైబుల్ వీక్ పై అవగాహనా ర్యాలీ లో చైల్డ్ గైడెన్స్ విద్యార్థులు, సిబ్బంది**



మేడిపల్లి, డిసెంబర్ 04 (వాయిస్ టుడే) : మాపై జాలి చూపోద్దు మా టాలెంట్ ని గుర్థించండి అంటూన్నారు.. మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ లో గల చైల్డ్ గైడేన్స్ సెంటర్ విద్యార్థులు ఈ సందర్భంగా ఈ నెల 5 నుండి 7 తేది వరకు జరగనున్న డిసైబుల్ వీక్ అవగాహనా కార్యక్రమం కోసంవిద్యార్థులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సిబ్బంది మాట్లాడుతూ ఈ అవగాహనా ఎగ్జిబిషన్ ప్రతి ఒక్కరు తెలుసుకుని ఎవరైన తెలిసిన వారు ఉంటె తెలియజేయాలనీ కోరారు.విద్యార్దులకు ఎ టాంలేంట్ ఉందో గమనించి అందులో నైపున్యులుగా తీర్చిదిద్ది వారి కాళ్ళపై వారు నిలబడేలా తయారు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది,విద్యార్దులు వారి తల్లిదండ్రులు పాల్గోన్నారు.

# సెక్యూరిటీ సర్వీస్ లో ప్రైవేట్ సెక్యూరిటీలు కీలకపాత్ర..

**సెంట్రల్ అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఇండస్ట్రీస్ చైర్మన్ డి.ఎస్ రెడ్డి**



సికింద్రాబాద్, డిసెంబర్ 04 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రభుత్వ ప్రవేట్ పబ్లిక్ సెక్టార్స్ ఆస్తులను కాపాడడం రక్షించడంలో ప్రవేట్ సెక్యూరిటీ లు కీలక పాత్ర పోషిస్తున్నారని సెంట్రల్ అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఇండస్ట్రీస్, సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ చైర్మన్ డి.ఎస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రవేట్ సెక్యూరిటీ డేను పురస్కరించుకుని సోమవారం ముషీరాబాద్ గాంధీ నగర్ లో సెక్యూరిటీ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చకచక్యంగా వ్యవహరించిన సెక్యూరిటీలు, అద్భుతంగా విధులు నిర్వహించిన సెక్యూరిటీలకు అవార్డ్స్ ప్రశంసా పత్రాలను డిఎస్ రెడ్డి అందజేసి మాట్లాడారు. నేటి సమాజంలో ప్రవేట్ సెక్యూరిటీలు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అపార్ట్మెంట్ నుండి మొదలుకొని ఎయిర్ పోర్టు వరకు ప్రైవేట్ ప్రభుత్వ సెక్టార్లో సేవలు అందిస్తున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా ఒక కోటి, తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల పైచిలుకు ప్రైవేట్ సెక్యూరిటీలు పనిచేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా 200 ప్రైవేట్ సెక్యూరిటీ కంపెనీలుగా అనేకమందికి ఉపాధి ఉద్యోగాలు అందిస్తున్నారని చెప్పారు.

ప్రభుత్వ, ప్రైవేటు, పబ్లిక్ సెక్టర్, ప్రజలు, సెక్యూరిటీలకు సేవలందిస్తూ అవకాశాలు కల్పిస్తున్న సెక్యూరిటీ కంపెనీలను కూడా ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మురా హరి గౌడ్, అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి బాలరాజ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, గోపి, సురేష్, నాగరాజు, కరెక్టే రవి, జాకబ్, సీతారామయ్య, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం.. మా లోపాలను సమీక్షిస్తాం



హైదరాబాద్: తెలంగాణలో ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత డాక్టర్ కె. కేశవరావు స్పందించారు. ప్రజా తీర్పును గౌరవిస్తున్నామన్నారు. ప్రపంచం మెచ్చేలా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణలో అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది అని చెప్పుకొచ్చారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించడానికి కారణాలను లోతుగా అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. తమ లోపాలను కచ్చితంగా సమీక్షించుకుంటామన్నారు. కొత్తగా కొలువు తీరబోతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు దిశగా కొత్త ప్రభుత్వం పని చేయాలని కోరుకుంటున్నట్లు కేకే వెల్లడించారు. ఈ మేరకు సోమవారం పత్రికా ప్రకటన విడుదలైంది.

**ఒకప్రక్క మున్సిపల్ కార్పోరేషన్ మరో ప్రక్క పోలీస్ స్టేషన్, మధ్యలో సెట్విన్**

# మందుబాబుల అడ్డాగా సెట్విన్ గ్రౌండ్..

**విద్యార్దులు తిరిగె ప్రాంతంలో మందు సిసలు**
**వార్తలతో గస్తి పెరిగి ఆగిన మందుబాబులు..**
**మల్లి రాత్రుల్లో అడ్డాగా సెట్విన్ సెంటర్ ప్రాగంణం..**



మేడిపల్లి, డిసెంబర్ 04 (వాయిస్ టుడే) : ప్రక్కన చూస్తే మున్సిపల్ కార్పోరేషన్ ఇటూ ప్రక్క పోలీస్ స్టేషన్, మద్యలో సెట్విన్ ..రాత్రి అయితె మందుబాబులకు సెట్విన్ సెంటర్ అడ్డాగా మారింది..సెంట్విన్ లో విద్యార్దిని విద్యార్దులు ట్రయినింగ్ కోసం వచ్చి బోజన సమయం ప్రాంగణంలో భోజనాలు చేస్తుంటారు..కాని అక్కడ ఎవ్వరో రాత్రుల్లు మందు తాగి బాటిల్లను అక్కడె వదిలి వెళ్ళడంతో పలువురు విద్యార్దులు అసహనం వ్యక్తం చెసారు. గతంలో ఈదే తంతుపై పత్రికల్లో వార్తలు రావడంతో పోలీసులు గస్తి పెంచడంతో కోంతకాలం ఆగిన మందుబాబులు మల్లి పాత అడ్డకు అలవాటు పడుతున్నారు. పిర్యాదులు రాకపోవడంతో గస్తి తగ్గంచడతో సెట్విన్ ను మందుబాబులు మరల అడ్డాగా మరుచుకుంటున్నారు. పోలీసులు రాత్రి సమయంలో తిరిగి గస్తి పెంచాలని ప్రజలు విద్యార్దులు కోరుతున్నారు.



## నాంపల్లి దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- నాంపల్లి దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ఉప్పల్ టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి నాంపల్లిలోని యూసఫ్ పెన్ దర్గాలో నియోజకవర్గంలోని మైనారిటీ నాయకులతో కలిసి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రేపు జరగబోయే ఎన్నికల ఫలితాలలో ఉప్పల్ నియోజకవర్గం నుండి టిఆర్ఎస్ పార్టీ భారీ మెజారిటీతో గెలుపొందాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు బద్రుద్దీన్ రాష్ట్ర నాయకులు కటార్ల భాస్కర్,గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్, మహబూబ్ బాల్రెడ్డి రాజిరెడ్డి, మక్బూల్ సయ్యద్, షేక్ రఫీక్ నజీర్, ఖాదర్ ఇర్ఫాన్ జియా అక్రమ్ హాజీ ముధసీర్ గౌస్ కోటి తదితరులు పాల్గొన్నారు.



**ఎర్రవెల్లి లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ని మర్యాద పూర్వకంగా కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో ఎన్నికల ఇంఛార్జి రావుల శ్రీధర్ రెడ్డి తదితరుల దృశ్యం.**

# ఆదరించిన ప్రజానీకానికి అండగా నిలుస్తాం



చిగురుమామిడి (వాయిస్ టుడే): సోమవారం చిగురుమామిడి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు కంది తిరుపతి రెడ్డి మాట్లాడుతూ మన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే కేవలం కాంగ్రెస్ తోనే సాధ్యమని భావిస్తూ పొన్నం ప్రభాకర్ గెలుపులో భాగస్వాములై విశేష ఆదరణ చూపించినటువంటి చిగురుమామిడి మండల ప్రజలు, మేధావులు, విద్యావంతులు, కూటమి నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు మీడియా మిత్రులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన అన్నారు. ఆదరించిన ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. “చేసేదే చెప్తం- చెప్పింది చేస్తం” అన్న మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని భరోసా ఇచ్చారు.

అనంతరం చిగురుమామిడి జెడ్పిటిసి గీకురు రవీందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ కు అత్యధిక ఓట్లు వేసి గెలిపించిన మండల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసే ప్రభుత్వమని అన్నారు. శాసనసభ్యులు పొన్నం ప్రభాకర్ ఉద్యమకారుడు, సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉంటారని, ప్రజల సమస్యలను పరిష్కరించుటలో ముందుంటారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా, నిజాయితీగా అమలు చేస్తామన్నారు. సమస్యల పట్ల అవగాహన, అభివృద్ధి పట్ల ఆలోచన కలిగిన శాసనసభ్యులు పొన్నం ప్రభాకర్ హాయంలో నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని అన్నారు.

గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి జరగలేదని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి సంక్షేమ పథకాలను మండలంలోనే కాకుండా నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి అందేలా చేసి ఇటు ప్రజలకు, అటు ప్రభుత్వానికి మధ్య వారధిలా మేముంటూ నియోజకవర్గ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. పాత్రికేయులు ప్రజల పక్షాన ప్రజాసమస్యలపై ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేస్తే అభివృద్ధి జరుగుతుందని, సామాన్యుల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, డిసిసి అధికారప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ నేత, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు పోలు స్వప్న, బిసి సెల్ మండల అధ్యక్షుడు పొన్నం సంపత్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు షాబొద్దీన్, గ్రామశాఖ అధ్యక్షుడు వంగ కనుకయ్య, నాయకులు పూల లచ్చిరెడ్డి, పోటు మల్లారెడ్డి, బెజ్జంకి అంజయ్య, జిల్లెల్ల భగవాన్ ప్రసాద్, అనుమోజు బాలకృష్ణ చారి, సాంబారి బాబు, యూత్ కాంగ్రెస్ నాయకులు గట్టు ప్రశాంత్, జిల్లెల్ల రమేష్ తదితరులున్నారు

## బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ పాల్గొన్న మండల అధ్యక్షుడు నవీన్

పాలకుర్తి డిసెంబర్ 4(వాయిస్ టుడే): పాలకుర్తి మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలకరుల సమావేశంలో పాల్గొన్న కన్నీటి పర్యంతమైన పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ రాజకీయం లో గెలుపు ఓటములు సహజమని పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన్న తీర్పు మేము అంగీకరిస్తున్నాము.కానీ పాలకుర్తి నీ అన్ని విధాలా అభివృద్ధి చేసిన దయాకర్ రావు నీ గెల్పించుకొక పోవడం చాలా బాధాకరం.దయాకర్ రావు ప్రజల మనిషి ఓటమితో క్రుంగి పోకుండా ప్రజల్లో ఉండి ప్రజలను కచ్చితంగా కన్నటికి రెప్పలా కాపాడుకుంటారని తెలిపారు.కార్యకర్తలు మనోధైర్యం కొలిపోవద్దని అన్ని విధాలా కార్యకర్తలను ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కార్యకర్తలు నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు





## ఖనిలో బిజెపి సంబరాలు...!

పెద్దపల్లి జిల్లా: డిసెంబర్. 4 (వాయిస్ టుడే) గోదావరిఖని ఈరోజు స్థానిక గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బీజేపీ సీనియర్ నాయకుడు మామిడి రాజేష్ ఆధ్వర్యంలో నిన్న జరిగిన నాలుగు రాష్ట్రల ఓట్ల లెక్కింపులో మధ్యప్రదేశ్,రాజస్థాన్,ఛత్తీస్ గడ్ రాష్ట్రాలలో బీజేపీ భారీ మెజార్టీ సాధించి ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్న సందర్భంగా ప్రధాన చౌరస్తాలో స్వీట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగిన బీజేపీ గెలుస్తుందని మొన్న జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీని చిత్తు చిత్తుగా ఓడించి మూడు రాష్ట్రాలు బీజేపీ కైవసం చేసుకుందని తెలిపారు తెలంగాణ రాష్ట్రం లో గతంలో కంటే ఇప్పుడు 8 సీట్లు గెలిచి ఓట్ల శాతం భారీగా పెరిగిందని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా నాలుగు వందల పార్ల మెంట్ స్థానాలు గెలిచి మూడవసారి నరేంద్రమోదీ ప్రధానిగా బాధ్యతలు చేపడతారని వారు స్పష్టంచేశారు జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు బీజేపీ నాయకులు కొమ్ము శ్రీనివాస్,మామిడి సంపత్,సీతాకరి చెంద్రశేఖర్,చిలుక భారతి,కుమ్మరి మల్లేష్, బుంగ మహేశ్ వడ్డేపల్లి సదానందం,చల్లా వేణురెడ్డి,కొమిరే లక్ష్మణ్ అధిక సంఖ్యలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మూడు రాష్ట్రాల్లో బిజెపి విజయదుందుబి.. వచ్చే కేంద్ర ఎన్నికలకు దిక్సూచి

### బిజెపి నాయకులు డాక్టర్ వన్నాల వెంకటరమణ....

వరంగల్ 4 డిసెంబర్(వాయిస్ టుడే ప్రతినిధి) మూడు రాష్ట్రాల్లో బిజెపి విజయభేరి మోగించడం రాబోయే కేంద్ర ఎన్నికలకు దిక్సూచి అని బిజెపి నాయకులు డాక్టర్ వన్నాల వెంకటరమణ అన్నారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి కార్యకర్తలు మనో ధైర్యాన్ని కోల్పోకుండా పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తూ ముందుకు సాగాలని కోరారు. ప్రతి బిజెపి కార్యకర్తకు వెన్నంటూ ఉంటానని తెలిపారు. అదేవిధంగా రాజకీయాల్లో ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. బిజెపి రాష్ట్ర నాయకత్వం బలపరిచిన తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావు ని యావత్తు బిజెపి వరంగల్ నాయకులు కార్యకర్తలు స్వాగతించి ,వారితోపాటు ఈ ఎన్నికల్లో అహర్నిశలు కష్టపడి పనిచేయడం జరిగింది. 2018 ఎన్నికల్లో పోల్చితే, ఈ ఎన్నికల్లో 51 వేల పైచిలుకు ఓటర్లు బిజెపి పార్టీకి మొగ్గ చూపారు. మిగతా పార్టీలతో పోల్చుకుంటే సౌమ్యుడైనా ప్రదీప్ రావు అతి తక్కువ ఓట్ల తేడాతో రెండవ స్థానంలో నిలబడడం జరిగింది. నైతికంగా డబ్బు ప్రభావం లేకుండా , ప్రజాధరణతో ఇన్ని ఓట్లు వేసినందుకు వరంగల్ తూర్పు ఓటర్ మహాశయులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని అయన అన్నారు. మూడు రాష్ట్రాలలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్గడ్ రాష్ట్రాల్లో బిజెపి ఘనవిజయం సాధించి , 2024 లో రానున్న పార్లమెంటు ఎన్నికల్లో యావత్ భారత ప్రజానీకం బిజెపిని గెలిపించి నరేంద్ర మోడీ మరోసారి ప్రధానమంత్రిగా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు డాక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు ముంద్రాతి వెంకటేశ్వర్లు మాదాసిరాజు సుబ్రహ్మణ్యం రాజకుమార్ చంద్రమౌళి సంపత్ దేవేందర్ సంగీత్ ప్రదీప్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవకే నా జీవితం

### కాంగ్రెస్ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




పాలకుర్తి డిసెంబర్ 4(వాయిస్ టుడే): పాలకుర్తి నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఎన్నడూ లేని విధంగా చరిత్రను తిరగ రాసిన అనుమాండ్ల యశస్విని రెడ్డి. తొర్రూరు మండలం చర్లపాల గ్రామానికి చెందిన యశస్విని రెడ్డి, బిఆర్ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్ రావు పై 47 వేల పైచినుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందడం జరిగింది.దయాకర్ రావు ఒక ఆడపిల్లను అని చూడ కుండా ఇబ్బందులకు గురిచేస్తూ కుట్రపూరిత రాజకీయాలు చేస్తూన్నాడని టీపీసీసీ సభ్యురాలు, పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ అనుమాండ్ల ఝాన్సీ రెడ్డి విమర్శించారు. దయాకర్ రావు పెట్టిన ఇబ్బందులను గుర్తుకు చేసుకుని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి హనుమాన్ల ఝాన్సీ రెడ్డి భాగోద్వానికి గురై కంటనీరు కార్చారు. పాలకుర్తి ప్రజలు తమ కుటుంబం పై చూపించిన ప్రేమ, అభిమానం, అనురాగం అత్తా కోడలు ఇంత దూరం తీసుకొచ్చిందని, నామీద రోజుకో కేసు, రోజుకో ఎత్తుగడవేసి ఇబ్బందులకు గురి చేశాడని, రోజుకో గండం, రేపు మరొక గండం, ప్రాణగండం వరకు తీసుకొచ్చిన కూడా పాలకుర్తి ప్రజల కోసం భరించామన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించిన మేము తగ్గలేదన్నారు.నా బిడ్డ లాంటి యశస్విని రెడ్డి భారీ మెజార్టీతో గెలిచింది అని అన్నారు అసెంబ్లీకి పంపించాలని పాలకుర్తి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఝాన్సీతో చిన్నతనంలోనే వివాహం జరిగిన వెన్ను తట్టి నన్ను ప్రోత్సహిస్తూ అష్టలక్ష్మి వలె నిలిచిందన్నరు.పాలకుర్తిలో కాంగ్రెస్ జెండా ప్రజలు నమ్మి నన్ను గెలిపించారని అన్నారు, అమెరికా నుండి దోచుకోవడానికి, దాచుకోవడానికి రాలేదని, ప్రజా సేవ కోసం వచ్చారని గుర్తు చేశారు, దళిత బంధు, బీసీ బంధు, రుణమాఫీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లతో దగా చేశారన్నారు. పాలకుర్తిలో మార్పు కావాలని, మ్మెల్యే గెలిస్తే వచ్చే జీతాన్ని కూడా అభివృద్ధి కోసం ఇస్తానన్నారు. గుర్తురులో 70 ఎకరాల్లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి పాలకుర్తి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామని, అదేవిధంగా అనాధ, వృద్ధ ఆశ్రమం మా అత్త ఝాన్సీ రెడ్డి నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే గెలిచిన వెంటనే పాలకుర్తి మండల కేంద్రంలోని ఆసుపత్రిని 100 పడకలు, జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీలు తీసుకొస్తానన్నారు. అదేవిధంగా అసంతృప్తి ఉన్న చెన్నూరు, పాలకుర్తి రిజర్వాలను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా బొమ్మెర పోతన మరియు సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ అభివృద్ధి పాలకుర్తి బస్టాండ్ పునరీ కరణ వంద రోజులలో చేసి చూపిస్తామని అన్నారు, నియోజవర్గ ప్రజలకు నన్ను ఆదరించి అభిమానంతో నాపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించినందుకు నన్ను నూతనంగా అసెంబ్లీకి ఎమ్మెల్యే ఎన్నికైన సందర్భంగాఅభినందనలు తెలియజేస్తున్నాను

## ప్రజా తీర్పు శిరసవహిస్తాను: కొప్పుల



జగిత్యాల జిల్లా బ్యూరో (నవంబర్ 04,23)వాయిస్ టుడే:అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ప్రజా తీర్పు ను శిరసావహిస్తున్నామని ధర్మపురి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ గెలుపు కోసం నిరంతరం పని చేసిన ప్రతి కార్యకర్తకు, ప్రేమతో ఓటేసి ఆశీర్వదించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజే శారు. ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇచ్చిన ప్రజలను మర్చి పోలేనని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో తనకు సహకరించిన ప్రజలకు, ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం పని చేసిన బీఆర్ఎస్ ప్రజా ప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్ లోనూ నియోజకవర్గ ప్రజలతోనే కలిసి ఉంటానని చెప్పారు.ప్రజా సమస్యలు ఎప్పటి కప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు తనవంతు సహకరిస్తానని చెప్పారు.ప్రజలు మార్పు కోరుకున్నారని చెప్పారు.తన స్వప్రయోజనాల కోసం ఏనాడు ఎవరిపైన ఆరోపణలు చేయలేదన్నారు.నియోజకవర్గం ప్రజలు అభివృద్ధి కోసమే తాను పని చేశనాన్నారు.

## నియంత పాలన అంతమైంది

### కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేయాలి


### ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్



కరీంనగర్ డిసెంబర్ 04(వాయిస్ టుడే) తెలంగాణ రాష్ట్రంలో ఒక నియంత పాలన, దురంకార పాలన, కుటుంబ పాలన అంతమైందని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ అన్నారు. ఆయన సోమవారం స్థానిక ప్రెస్ భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కెసిఆర్ నాటిన సామ్రాజ్యాన్ని మొత్తం కూకటి వెళ్ళ తో కూల్చివేయాలన్నారు. పత్రిక రంగంతోపాటు, విద్య రంగాలను మొత్తం కెసిఆర్ నిర్వీర్యం చేశారని ఆరోపించారు.విద్య వైద్య రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పటిష్టత చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. మిషన్ భగీరథ మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో జరిగిన వేల కోట్ల అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. ఈ 10 సంవత్సరాలలో తెలంగాణ ప్రజల గొంతును బిఆర్ఎస్ పాలకులు నొక్కి పెట్టారని అన్నారు. కరీంనగర్ జిల్లాను 8 ముక్కలు చేశారని ఆరోపించారు. తెలంగాణలో 33 జిల్లాలు అవసరం లేదన్నారు. తెలంగాణలో కెసిఆర్ నియంత పాలన పై ప్రజలు ఓటు ద్వారా తిరుగుబాటు చేశారని తెలిపారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అక్రమంగా సంపాదించిన డబ్బు పై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరిపించాలన్నారు.

కెసిఆర్ ను కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మకుండా 24 గంటలు కళ్ళు తెరచి ఉండాలి అన్నారు. తెలంగాణలో ఒక భయంకర పరిస్థితి నుంచి ప్రజలు బయటపడ్డారని తెలిపారు. గత 10 సంవత్సరాల మాయాజాల, కుటుంబ పాలన ను కెసిఆర్ కొనసాగించారన్నారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ మీడియా సమావేశంలో సిగిరి శ్రీధర్ రామ్మూర్తి, కిషన్ , కాలిద్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల నమోదు కార్యక్రమం (యుడైస్ ప్లస్) పై అవగాహన సదస్సు

గంగాధర, డిసెంబర్ 04 (వాయిస్ టుడే)పాఠశాలలో విద్యార్థుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసే యుడైస్ ప్లస్ పై మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. గంగాధర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల వివరాలను అలాగే నూతన విద్యార్థుల వివరాలను ఆన్లైన్ లో ఏ విధంగా నమోదు చేయాలనే అంశాలపై ప్రొజెక్టర్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు వివరించారు. ఇట్టి కార్యక్రమంలో ఎంఈఓ వేణు కుమార్, ఎస్ ఎస్ ఏ సెక్టోరియల్ అధికారి మహేందర్, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల సిఆర్ పి లు పాల్గొన్నారు.



కేసిఆర్‌కు హుజూరాబాద్ గెలుపును బహుమతిగా ఇచ్చిన పాడి సోమవారం తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కే సి ఆర్ నీ ఆయన నివాసం లో మర్యాద పూర్వకంగా కలిసి హుజూరాబాద్ గెలుపును ఆయనతో పంచుకుని తన గెలుపును బహుమతిగా ఇచ్చారు హుజూరాబాద్ లో ఎం ఎల్ ఏ గా గెలిచిన బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి.. ఆయన వెంట ఆయన భార్య మరియు కూతురు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా కే సి ఆర్ కౌశిక్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేశారు.

- వాయిస్ టుడే, జమ్మికుంట



## ప్రజా తీర్పును గౌరవిస్తాం

**నియోజకవర్గ ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగుతుంది....**

**బిఆర్ఎస్ పార్టీ శ్రేణులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం....**

**నాయకులు, కార్యకర్తలు ఎవరూ బాధపడొద్దు, అధైర్య పడొద్దు....**

**అన్నివేళలా అందుబాటులో ఉంటూ, అండగా ఉంటం....**

తొర్రూర్, డిసెంబర్ 04(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొని గత రెండు పర్యాయలు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బిఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగించింది ప్రజా తీర్పును గౌరవిస్తున్నం, రాజకీయాలలో గెలుపోటములు సహజం, అధికారంలో లేకపోయినా ప్రజా సమస్యల పట్ల పోరాటం కొనసాగిస్తామని పాలకుర్తినియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగేలా చూస్తా%శీ% బిఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ కార్యకర్తకు పాదాభివందనం. పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు ఎవరూ బాధ పడవద్దు, అధైర్యపడొద్దు ..పార్టీ నాయకులను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాము,పదవిలో ఉన్నా లేకపోయినా నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని వారి కష్ట సుఖలలో అండగా ఉంటామని హామీ ఇస్తున్నాం.



## దొంతికి కేబినెట్‌లో చోటు కల్పించాలి

### చెన్నారావుపేట మండల అద్యక్షులు భూక్య గోపాల్ నాయక్

నర్సంపేట(వాయిస్ టుడే) కాంగ్రెస్ పార్టీకి,ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి అండగా నిలిచిన మండల ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతు చెన్నారవు పేట మండల కేంద్రం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మండల అద్యక్షులు భూక్య గోపాల్ నాయక్ మాట్లాడుతూ చెన్నారావుపేట మండలం నుండి సుమారు 5 వేల మెజార్టీ ఇచ్చి దొంతి మాధవరెడ్డి గెలుపులో భాగస్వామ్యం అయిన మండల ప్రజలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు,నాయకులకు,ప్రజా ప్రతినిధులకు,మండల కమిటీ నాయకులకు,మహిళ కాంగ్రెస్,యువజన కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులకు,అభిమానులకు ప్రత్యేక దన్యవాదాలు శుభాకాంక్షలు తెలిపారు. అదే విదంగా నర్సంపేట నియోజకవర్గం నుండి 2వ సారి గెలిచి అసెంబ్లీలో అడుగు పెడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి కేబినెట్ లో చోటు కల్పించాలని మండల కమిటీ, జిల్లా నాయకులు, మండల నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేశారు..1981లో రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టి సర్పంచ్ స్థాయి నుండి అమీనాబాద్ పిఏసీఎస్ చైర్మెన్, డీసీసీబీ చైర్మన్ గా సేవలను అందించిన మాధవరెడ్డి రెండు పర్యాయాలు ఎమ్మెల్యే గా గెలిచారు..2014లో స్వతంత్ర అభ్యర్తిగా గెలిచి తిరిగి సోనియమ్మ రుణం తీసుకోవడానికి కాంగ్రెస్ లో చేరారని అన్నారు.ఆనాడు టి ఆర్ ఎస్ ప్రభుత్వం ఎన్ని ఒత్తిళ్లు చేసిన తలొగ్గని నాయకుడు మా దొంతి మాధవరెడ్డి గారని కావున కాంగ్రెస్ ప్రభుత్వం లో మంత్రి పదవి ఇచ్చి మా నాయకుడు దొంతి మాధవరెడ్డి ని గౌరవించాలని కాంగ్రెస్ మండల అద్యక్షులు భూక్య గోపాల్ నాయక్ విజ్ఞప్తి చేసారు..ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు,బ్లాక్ కాంగ్రెస్ నాయకులు,మండల నాయకులు,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లు ,మండల ఉపాధ్యక్షులు,ఆయా గ్రామాల సర్పంచులు,ఎంపిటిసీలు,ఆయా గ్రామాల గ్రామ అద్యక్షులు, వివిధ హెూదల్లో ఉన్న నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..



## కాంగ్రెస్ విజయంతో న్యాయవాదుల సంబరాలు

వరంగల్ 4 డిసెంబర్(వాయిస్ టుడే ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం తో వరంగల్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ న్యాయవాదుల ఆధ్వర్యంలో సోమవారం సంబరాలు జరుపుకొన్నారు. హనుమకొండ అదాలత్ వద్ద న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరై భారీ ఎత్తున టపాసులు కాల్చారు. జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేస్తూ తెలంగాణ ప్రజల తీర్పు చారిత్రాత్మకమని బి ఆర్ ఎస్ దుష్ట పాలన కు చరమ గీతం పాడారని కొనియాడారు.అనంతరం స్వీట్ల పంపిణి చేశారు. లీగల్ సెల్ న్యాయవాదులు తోట రాజ్ కుమార్, జగన్ మహాన్ రెడ్డి, నల్ల మహాత్మా, శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ

కాంగ్రెస్ విజయం అన్నివర్గాల ప్రజల కృషితోనే సాధ్యమైంద న్నారు. రానున్న రోజులలో న్యాయవాదుల సంఘక్షేమనికి కట్టుబడి పని చేస్తామని, ప్రజాపాలన కాంగ్రెస్తోనే సాధ్యమని పేర్కొ న్నారు.

## సార్వత్రిక ఎన్నికల్లో నర్సంపేట ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నా: పెద్ది



నర్సంపేట (వాయిస్ టుడే) నర్సంపేటలో పెద్ది సుదర్శన్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో నర్సంపేట ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నా ఇన్నేండ్లుగా నాతో నడిచిన ప్రతి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం. అండగా ఉంటాం.నేను మీ మధ్య పుట్టి పెరిగిన వాడిని, సామాన్య రైతు కుటుంబం నుంచి ఈ స్థాయికి వచ్చిన వాడిని. నియోజకవవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొచ్చాను, గొప్ప గొప్ప కార్యక్రమాలకు నర్సంపేట వేదిక అయింది ప్రజా తీర్పు ఎలా ఉన్నా నిత్యం ప్రజల కోసమే పని చేస్తుంటాను ప్రతి కార్యకర్త కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత నాది, పార్టీది ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మరింత ధైర్యంగా ముందుకెళదాం. కార్యకర్తలు అధైర్య పడొద్దు అండగా నేనున్నాను. ఉద్యమం నుంచి నేటి వరకు నాతో తోడుగా నిలిచిన ఉద్యమ కార్యకర్తలు నాయకులు,అండగా నిలిచిన ప్రజలకు కృతజ్ఞతలు అని తెలియచేశారు.

# బీజేపీ పోరాటంతోనే ఎర్రబెల్లి ఓటమి



తొర్రూర్, డిసెంబర్ 04(వాయిస్ టుడే): ఎర్రబెల్లి దయాకర్ రావు ఓటమి తో పాలకుర్తి నియోజకవర్గంలో అరాచక పాలన, నిరంకుశ,నియంత్రృత్వ పాలన అంతం అయిందని, పాలకుర్తి ప్రజలకు విముక్తి లభించింది అని , బీజేపీ ఉద్యమం ప్రభావం తోనే దయాకర్ రావు ఓటమి పాలయ్యారు అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి లేగా రాం మోహన్ రెడ్డి తెలిపారు.ఈరోజు తొర్రూరు లో బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటమి ఎరుగని ధీరుడని గొప్పలు చెప్పుకునే ఎర్రబెల్లి దయాకర్ రావుకు పాలకుర్తి ప్రజలు తగిన గుణపాఠం చెప్పి చిత్తు చిత్తుగా ఓడించారని,ప్రజలను మాయమాటలతో మభ్య పెట్టాలని చూసినా,ఎన్నో రకాల ప్రలోభాలకు గురి చేసినా, డబ్బు, మద్యం ఎరజూపినా కూడా పాలకుర్తి ప్రజలు చాలా చైతన్యవంతులని ఎర్రబెల్లికి సరైన గుణపాఠం చెప్పి పాలకుర్తి నుండి తరిమి కొట్టారని తెలిపారు.ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందకుండా చేసి తన అనుయాయులకు, సొంత పార్టీ కార్యకర్తలకు మాత్రమే లబ్ధి చేకూర్చిన దయాకర్ రావు కు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారని తెలిపారు.రాష్ట్రంలో కేసిఆర్ కుటుంబ పాలన అంతం అయిందని , తెలంగాణ ప్రజలకు కేసిఆర్ నియంత్రృత్వ పాలన నుంచి విముక్తి లభించింది అని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు చేసి ఓట్లు దండుకున్నదని, డబ్బు, మద్యం విపరీతంగా పంపిణీ చేసే ప్రజాస్వామ్య వ్యవస్థ ను అపహాస్యం చేసింది అని తెలిపారు.బీజేపి పార్టీ ప్రజల పక్షాన నిలబడి,భాద్యత కలిగిన ప్రతిపక్షం గా ప్రజల కోసం పనిచేస్తాం అని తెలిపారు.ధేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ నాలుగు రాష్ట్రాల్లో విజయదుందుబి మోగించింది అని, ప్రదాని నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో ధేశం సురక్షితంగా ఉంటుంది అని ప్రజలు నమ్ముతున్నారు అని , మోడీ గారి నాయకత్వమే ఈధేశానికి శిరోధార్యం అని తెలిపారు.ఈసమావేశంలో బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా నాయకులు 15వార్డు కౌన్సిలర్ కొలుపుల శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు రంగు రాములు, దుబ్బ రాజశేఖర్, జిల్లా కార్యదర్శులు సాయిని ఝాన్సీ, సోమన్న ,తొర్రూరు రూరల్ మండలం అధ్యక్షుడు బొచ్చు సురేష్ , చింతా స్రృజన్, కమ్మగాని శ్రీకాంత్, రాజేష్ ,ఉపేంధర్, యాకయ్య,పులేందర్,విజయ్ కుమార్, నవీన్, సంతోష్, శివ, రాజేందర్ ,రవి, సందీప్, శివ సాయి, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.



## హుజూర్‌నగర్ నియోజకవర్గ మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ సైదాకు ముస్లిం యువకుల ఘన సన్మానం

హుజుర్ నగర్ (వాయిస్ టుడే ప్రతినిధి) హుజూర్ నగర్ అసెంబ్లీ ఎన్నికలలో పట్టణములోని 222 పోలింగ్ కేంద్రంలో మరియు నియోజకవర్గ వ్యాప్తంగా ఉత్తమ్ గెలుపు కోసం పని చేసిన హుజూర్ నగర్ నియోజకవర్గ మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ సైదాకు ముస్లిం యువకులు యూసుఫ్ రఫీ సత్తార్ మీరా ఘనంగా దట్టి కట్టి శాలువతో సన్మానించి స్వీట్లు తినిపించారు అనంతరం 19వార్డు అధ్యక్షుడు గౌడ సంఘం అధ్యక్షుడు వల్లపు దాసు కృష్ణ గౌడ్19 వార్డు మాజీ కౌన్సిలర్ వల్లపు దాసు ఎల్లమ్మ వెంకటేశ్వర్లు మరియు వార్డు ప్రజలతో కలిసి శాలువాతో సత్కరించి పూలమాలవేసి సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణ గౌడ్ మాట్లాడుతూ హుజూర్ నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీలో పదవులు దరిచేరినా స్వీకరించకుండా కార్యకర్తలా శ్రమించి పార్టీలు మారకుండా అధికార పార్టీ ఎన్ని ఒత్తిళ్లకు గురిచేసిన ఎన్ని కేసులు పెట్టినా ఉత్తమ్ కుమార్ రెడ్డి గెలుపు కోసం కృషి చేసిన సైదా మేస్త్రి ని వార్డు ప్రజల తరపున ఘనంగా సన్మానించుకున్నామన్నారు.

## కోరిక నెరవేర్చిన శివయ్య



హుజుర్ నగర్ (వాయిస్ టుడే ప్రతినిధి) సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలదొండపాడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కుమార్తెలు ప్రీతి గంగోత్రి లు హుజూర్నగర్ కోదాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు ప్రతిరోజు దొండపాడు గ్రామంలో వెంచేసియున్న శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామికి ప్రతిరోజు 51 ప్రదక్షిణలు చేసి ఆలయ అర్చకులు చే ప్రత్యేక పూజలు నిర్వహించారు హుజుర్ నగర్ లో ఉత్తంకుమార్ రెడ్డి కోదాడలో ఆయన సతీమణి ఉత్తమ్ పద్మావతి భారీ మెజారిటీతో గెలుపొందడంతో కోరిక నెరవేరడంతో సోమవారం ఉదయం శివాలయంలో 101 ప్రదక్షిణలు చేసి 101 కొబ్బరికాయలు తో మొక్కులు చెల్లించుకున్నారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరాల కొండారెడ్డి సీనియర్ నాయకులు గోపిరెడ్డి పుల్లారెడ్డి కొండ వీరారెడ్డి గ్రామ శాఖ అధ్యక్షులు చెన్నకేశ వెంకయ్య వార్డు నెంబర్ రాంబాబు పిల్లి సైదిరెడ్డి మాజీ ఎంపిటిసి గుండెబోయిన వెంకటేశ్వర్లు దొంగల కార్తీక్ మావిడి నరసింహారావు కలగొట్ల వెంకటరెడ్డి మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్లన్న కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు

### సుంకర అజయ్ కుమార్




మునగాల డిసెంబర్ 4 (వాయిస్ టుడే ) తెలంగాణ రాష్ట్ర శాసనసభకు నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో భాగంగా కోదాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బొల్లం మల్లయ్య యాదవ్ వెంట అహర్నిశలు గత నెల రోజులుగా మునగాల మండల వ్యాప్తంగా కష్టపడి పని చేసిన వివిధ గ్రామాల్లోని పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సుంకర అజయ్ కుమార్ ,మండల పార్టీ అధ్యక్షుడు తొగర రమేష్ .మునగాల పిఎసిఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పార్టీ కార్యాలయం నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, పార్టీ అభ్యర్థి మల్లన్న విజయం కోసం అహర్నిశలు గ్రామ గ్రామాన ఎన్నికల ప్రచారంలో మరియు సభలు సమావేశాల్లో నిరంతరం పార్టీ యంత్రాంగం విశేషంగా కృషి చేసిందని. అయినా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు మార్పు కోరుకోవడంతో తమ పార్టీ అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చిందని, డిసెంబర్ 3న ప్రకటించిన ఎన్నికల ఫలితాల్లో తమ పార్టీకి వ్యతిరేకంగా ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటికీ గ్రామస్థాయిలో పార్టీ నాయకత్వం మరియు కార్యకర్తలు ఎవరు అధైర్య పడవద్దని ఎల్లప్పుడూ మల్లన్న మరియు స్థానిక పార్టీ నాయకత్వం గ్రామ గ్రామాన ప్రజల వెన్నంటే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం అభివృద్ధి విషయంలో మండల వ్యాప్తంగా తమ పార్టీ అన్నివేళలా సహకరిస్తుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వానికి మరియు నియోజకవర్గ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో తాడువాయి పిఎసిఎస్ చైర్మన్ తొగరి సీతారాములు, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు వీరం రెడ్డి లింగారెడ్డి ,కొంపెల్లి వీరబాబు, ఏనుగుల నాగేశ్వరరావు, ఎస్కే సైదా, నవీన్ రెడ్డి, గవిని శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో నీళ్లలో పడి వ్యక్తి మృతి

చేవెళ్ల.. డిసెంబర్ 4(వాయిస్ టుడే) శంకర్ పల్లి మండలం పర్వేద గ్రామానికి చెందిన వ్యక్తి నీళ్లలో పడి మృతి చెందిన సంఘటన శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శంకర్ పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శంకర్ పల్లి మండలం పర్వేద గ్రామానికి, చెందిన కావలి కుమార్ (30)తండ్రి రాములు వ్యవసాయం చేసుకుని జీవనాధారం గడిపేవారు ఈరోజు మధ్యాహ్నం మద్యం సేవించి మద్యం మత్తులో ఊరు దగ్గరలో గల బతుకమ్మ కుంట లో ఈత కొట్టడానికి వెళ్లి నీళ్లలో పడి మృతి చెందాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఏవివిలో భక్తిశ్రద్ధలతో పోతన జయంతి వేడుకలు





వరంగల్ 4 డిసెంబర్ (వాయిస్ టుడే ప్రతినిధి) వరంగల్ నగరంలోని ఏవివి కళాశాలలో సోమవారం భక్తిశ్రద్ధలతో కవి పోతన జయంతి వేడుకలు నిర్వహించారు .కళాశాల లో సాయంత్రం జరిగిన కార్యక్రమానికి ఏవివి జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి ఎల్ ఎన్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ కలియుగ మానవుడు తరించిపోవాలంటే భాగవతమే ఏకైక సాధనమని ప్రారబ్ద కర్మలను తొలగించి ముక్తిని పొందుటకు ఉపకరించే గ్రంథరాజమని అన్నారు. తాను 30 సంవత్సరాలు ఇదే విద్యాసంస్థలో పనిచేశానని సంస్థలోని జీవించానని అన్నారు. పోతన జయంతి పండుగ అంటే ఊరంతా పండుగ అన్నారు. అన్నదానం గురుసేవ యజ్ఞం చేయడం వల్ల అప్పటికప్పుడే ఫలితాలు వస్తాయని ప్రసాద్ వివరించారు. ముఖ్యఅతిథి శ్రీమాన్ సముద్రాల శ ట గోపాచార్యులు తమ సందేశంలో భాగవత కథ ప్రారంభము ముఖ్యమైన ఘట్టములు వివరించి విద్యార్థులు భక్తిని పెంపొందించుకొని జ్ఞానాన్ని ఆర్జించాలని వీనుల విందుగా వివరించారు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ భుజయేందర్ రెడ్డి మాట్లాడుతూ గత 60 సంవత్సరముల నుండి పాఠశాల విద్యార్థులకు భాగవత పద్య పఠన పోటీలు నిర్వహిస్తూ బాల్యము నుండే పిల్లలలో ఆధ్యాత్మిక స్పృహను కలిగిస్తున్నామన్నారు. డిగ్రీ మరియు పీజీ కళాశాలల ప్రిన్సిపాల్ బి వెంకటేశ్వరరావు ఆచార్య చందాకాంతయ్య శ్రేష్టి ఆలోచనలతో ప్రారంభమైన పోతన జయంతి వేడుకలు మన ఏవివి కళాశాలలోనే వైభవంగా నిర్వహిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ఏవివి విద్యాసంస్థల కార్యదర్శి మరియు కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయకుమార్ , శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్ పాలకవర్గ సభ్యులు ఏవివి విద్యాసంస్థల అధ్యాపక అధ్యాపకేతర బృందము పుర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం పద్య పఠ న పోటీలలో విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది చివరకు జరిగిన సాంస్కృతిక కార్యక్రమములు సభికులను అలరించినవి.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం



# ముఖ్యమంత్రిగా అన్ని అర్హతలు ఉన్న సీఎల్పీ నేత భట్టి

మధిర డిసెంబర్ 4 (వాయిస్ టుడే న్యూస్) ఈరోజు జరిగే సీఎల్పీ సమావేశంలో ఏకవాక్యంతో మల్లు భట్టి విక్రమార్క ముఖ్యమంత్రిగా ఎన్నిక కావాలని మదిర ప్రజలు ఎదురుచూస్తున్నారు. భట్టి విక్రమార్క ముఖ్యమంత్రిగా ఎన్నిక కావడానికి ఉన్న అర్హతలు. గత 50 సంవత్సరాలు నుండి మల్లు కుటుంబం అంకితభావంతో కాంగ్రెస్ పార్టీతో అనుసంధానమై ఉంది. మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ స్పీకర్ గా మరియు సీఎల్పీ లీడర్ గా పని చేసిన అనుభవం వుంది. భట్టి విక్రమార్క పాదయాత్ర చేసిన ప్రతి ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి ఎన్నికలలో సత్ఫలితాలను ఇచ్చింది. అలాగే వయసు రీత్యా భట్టి కి ముఖ్యమంత్రి అయ్యే అర్హత ఉంది. ముఖ్యంగా పార్టీలోని ప్రతి నాయకుడుతో సత్సంబంధాలు ఉన్నాయి. గత పది సంవత్సరాల నుంచి ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఎంతమంది పార్టీ మార్పు ప్రలోభ పెట్టిన కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న వ్యక్తిత్వం బట్టి ది. ముఖ్యంగా కెసిఆర్ దళితున్ని ముఖ్యమంత్రి చేస్తా అని వాగ్దానం చేశారు కానీ అది నెరవేర్చలేకపోయారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ దళితన్ని సీఎం చేసి తెలంగాణకు న్యాయం చేసినట్లు అవుతుంది. ఇది రాజకీయంగా ప్రతిపక్షానికి సరైన సమాధానం ఇచ్చినట్లు అవుతుంది. మన మధిరకు ఒక ముఖ్య మంత్రిని ఎన్నుకున్న అవకాశం, అదృష్టం మన అందరిదీ. కావున ఇంకొక రెండు గంటలలో ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క పేరు ప్రతిపాదిస్తారని ఆశిస్తున్నారు మధిర ప్రజలు.






## కాంగ్రెస్ ను గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

### చిట్టెం ఓటమితో మొక్కు తీర్చుకున్న రవికుమార్ యాదవ్

మక్తల్, డిసెంబర్ 04 (వాయిస్ టుడే ప్రతినిధి): మఖ్తల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వాకిటి శ్రీహరిని సంపూర్ణ మెజారిటీతో గెలిపించి, ఆయన విజయంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ నేతలు గవినోళ్ల బాలకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, రవికుమార్ యాదవ్, చంద్రకాంత్ గౌడ్, గవినోళ్ల గోపాల్ రెడ్డి, గడ్డంపల్లి హనుమంతు, శ్రీనివాస్ రెడ్డి, కావలి శ్రీహరి, ఏ.రవి కుమార్, ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున అందరు నాయకులు డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నాగరాజ్ గౌడ్ ఇతర నేతలు అందరూ ఏకతాటిపైకి వచ్చి వాకిటి శ్రీహరి విజయంలో కీలక భూమిక పోషించారని అన్నారు. ఈ సందర్భంగా చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓడిపోతే గుండు కొట్టించుకుంటానన్న మొక్కును మాజీ మార్కెట్ చైర్మన్ రవికుమార్ యాదవ్ తీర్చుకున్నారు. పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో గుండు కొట్టించుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. మఖ్తల్ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేసి, నియోజకవర్గం ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు వాకిటి శ్రీహరికి సహకరిస్తామని అన్నారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి నియోజకవర్గం ను పట్టించుకోలేదని వాపోయారు. సమావేశంలో నేతలు రాజప్పగౌడ, మూర్తి, కల్లూరి గోవర్ధన్, గుంతలి రవి తదితరులు పాల్గొన్నారు.



## కొత్తగూడెం ఏరియా ఆద్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

(భద్రాద్రికొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్4) అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించికొని ఈ రోజు సోమవారం ఉదయం 11గంటలకు కొత్తగూడెం ఏరియా ఆద్వర్యంలో రుద్రంపూర్ ఆర్‌సిఓఏ క్లబ్ నందు దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. పాల్వంచలో దివ్యాంగుల కొరకు నిర్వహిస్తున్నటువంటి శాంతి వెల్ఫేర్ డెఫ్ %డ% డంబ్ మరియు మెంటల్లీ హాండిక్యాపిడ్ స్కూల్ నుండి వచ్చిన 40 మంది దివ్యాంగులు ఆటలపోటీలలో ఉత్సాహముగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కొత్తగూడెం ఏరియా జి.ఎం. ఎం. షాలెమ్ రాజు హాజరు అయినారు. ఈ సందర్భంగా జి.ఎం. మాట్లాడుతూ.. సింగరేణి ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శ్ఎన్. శ్రీధర్ ఆదేశాల మేరకు ఈ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము, దివ్యాంగులకు సేవ చేస్తే దేవునికి సేవ చేసినట్లే అని వారి అభివృద్ధి కి ప్రతి ఒక్కరూ తమ వంతుగా సహాయాన్ని అందించాలని తెలియజేశారు. ఈ సందర్బంగా పాల్వంచలో దివ్యాంగుల కొరకు శాంతి వెల్ఫేర్ స్కూల్ చేస్తున్నటువంటి కృషిని అభినందించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ పి.ఓ. పర్సనల్ మజ్జి మురళి, సీనియర్ సెక్యూరిటి ఆఫీసర్ రమణ రెడ్డి, శాంతి వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపల్ క్రిసోలైట్ మరియు ఉపాధ్యాయులు, 40 మంది దివ్యాంగులు, సేవా మరియు స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సాగర్, సింగరేణి సేవా సెక్రెటరీ అనిత, సేవా సభ్యులు మరియు పర్సనల్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## టిపిసిసి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎండి అజీజ్ షాషాకి శాలువాలతో సన్మానం



హుజుర్ నగర్ (వాయిస్ టుడే ప్రతినిధి ) అభివృద్ధి ప్రదాత ఉత్తమ్ గెలుపు కు బూత్ నెంబర్ 223 లో అధిక మెజార్టీ వచ్చినందుకు టిపిసిసి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎండి అజీజ్ షాషా కి శాలువాలతో సన్మానం చేశారు సిపిఐ జిల్లా నాయకులు ఎల్లావుల రమేష్ చక్రాల వెంకటేశ్వర్లు జక్కుల కొమరయ్య,సురేషు,దస్తగిరి,బాబా,భాష,వార్డులోని మహిళలు ఎల్లావుల ఉమా, లక్ష్మి,స్వాతి, డిన్ను,పద్మ,గీత,లింగమ్మ సన్మానించడం జరిగింది. అనంతరం కేక్ కట్ చేసి ఘనంగా ఉత్తమ్ గెలుపు ఉత్సాహంలో సెలబ్రేషన్ చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు యువకులు పాల్గొన్నారు.

## 8న కామారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా పరిషద్ చైర్ పర్సన్ దఫెదర్ శోభ రాజు అద్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం

కామారెడ్డి బ్యూరో డిసెంబర్4 వాయిస్ టుడే: జిల్లా పరిషద్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఈ నెల 8 న ఉదయం పదిన్నర గంటలకు కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నందు జిల్లా పరిషద్ చైర్ పర్సన్ దఫెదర్ శోభ రాజు అద్యక్షతన జరుగుతుందని జెడ్.పి . సీఈఓ సాయ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి సమావేశంలో జిల్లా పరిషద్ గౌరవ సభ్యులు, ప్రజాప్రతినిధులు లేవనెత్తే పలు అంశాలకు సంబంధించి అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో సమావేశానికి హాజరు కావలసినదిగా అయన విజ్ఞప్తి చేశారు.

## ప్రజల తీర్పును శిరసా వహిస్తాం

### - మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్




గోదావరిఖని, డిసెంబరు 4: రామగుండం నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసా వహిస్తున్నామని, ఫలితాలు, జయాపజయాలు ఎలా ఉన్నా ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలబడి ఉంటామని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం స్థానిక చౌరస్తా సమీపంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం రామగుండం నియోజకవర్గంలో కృషి చేసిన కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులకు చందర్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఓటు వేసిన ప్రజలకు కూడా ధన్యవాదాలు చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైననాటి నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టించిందన్నారు. అసత్య ప్రచారాలు, నిరాధారమైన ఆరోపణలు చేస్తూ అమలు కాని వాగ్దానాలతో ప్రజలను ఆశ చూపి ఎన్నికల్లో గెలిచారని చందర్ చెప్పారు. హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు, ఈ ప్రాంతానికి మక్కాన్‌సింగ్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన తమ కార్యకర్త ఎంచర్ల మహేష్‌పై ఆదివారం కొందరు దాడి చేశారన్నారు. ఎన్నికల ప్రచారంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు, అభియోగాలు చేసుకోవడం సాధారణమని, దానిని కక్షసాధింపు ధోరణితో దాడికి పాల్పడడం అమానుషమని చందర్ అన్నారు. తమ కార్యకర్తలకు, యకులకు ఏం జరిగినా ఎమ్మెల్యే మక్కాన్‌సింగే బాధ్యత వహించాలని చందర్ పేర్కొన్నారు. అయితే తమ కార్యకర్తలకు ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటానని, ఎవరూ అధైర్య పడవద్దని చందర్ చెప్పారు.





# ఇందూరు ప్రజల ఆశీర్వాదంతోనే నా గెలుపు

### నిజామాబాదు అర్బన్ శాసనసభ్యులు దన్ పాల్ సూర్యనారాయణ

నిజామాబాదు అర్బన్: డిసెంబర్ 04 (వాయిస్ టుడే ప్రతినిధి) బీజేపీ జిల్లా కార్యాలయంలో నిజామాబాదు అర్బన్ శాసనసభ్యులు దన్ పాల్ సూర్యనారాయణ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్బంగా సూర్యనారాయణ గారు మాట్లాడుతూ ఇందూరు ప్రజల ఆశీర్వాదం తో నే గెలుపొందడం జరిగింది అన్నారు నా గెలుపు కు సాయ శక్తుల కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు, బూత్ స్థాయి సభ్యుల కు, నగరం లోని అన్ని వర్గాల ప్రజలకు, మీడియా మిత్రులకు, పోలీస్ లకు, ఎన్నికల అధికారులకు, ధన్యవాదములు తెలిపారు నగర అభివృద్ధి లక్ష్యంగా ఒక సేవకుడిలా పని చేస్తా అన్నారు కేంద్రం లోని మోదీ ప్రభుత్వం ప్రవేశ పెడ్తున్న ప్రతి పథకాన్ని నగరం లో ఇంటి ఇంటికి తీసుకెళతామని అన్నారు నగరంలో 6 నెలల కోసారి జాబ్ మేళా నిర్వహిస్తాం అన్నారు, నగరం లోని ఇండ్లు లేని అర్హులైన నిరుపేదలకు వచ్చేలా కృషి చేస్తామని తెలియచేశారు, అర్బన్ నియోజకవర్గాన్ని అద్భుతమైనా నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు కార్యకర్తల కు ఎల్లవేళలా అండగా ఉంటాను అని పేర్కొన్నారు సమాజ సేవలో నిరంతరం నా ట్రస్ట్ ద్వారా సేవ కార్యక్రమాలు కొనసాగుతాయి అన్నారు ప్రజల అందరు అభివృద్ధి కి సహకరించాలని కోరారు కాలోని లోని నెలకొన్న సమస్యల ను తీరుస్తా అన్నారు డ్రైనేజీ వ్యవస్థ వాళ్ళ ఇబ్బంది కాకుండా చూస్తాను అని అన్నారు రాబోయే రోజుల్లో ప్రజల తో మామేకై మీకు అండగా ఉంటాను అన్నారు ఈ సందర్బంగా జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మి నరసయ్య శాలువా, బుకే తో దన్ పాల్ సూర్యనారాయణ గారిని సన్మానించారు ఈ కార్యక్రమం లో అసంబ్లీ కన్వీనర్ పంచ రెడ్డి లింగం జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు, పడుగేల వెంకటేష్, కార్పొరేటర్లు మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు

### మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి) గత నెల 30న జరిగిన ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుంభం అనీల్ కుమార్ రెడ్డి చెయ్యి గుర్తుకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బర్రె జహంగీర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుంభం అనీల్ కుమార్ రెడ్డి భారీ విజయం సాధించడంతో హర్షం వ్యక్తంచేశారు. తనను నమ్మి తమ తమ పార్టీ అభ్యర్థి కుంభం అనీల్ కుమార్ రెడ్డి చెయ్యి గుర్తుకు ఓటు వేసి గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. భువనగిరి మున్సిపల్ పట్టణంలోని 8,9,20,21,22,23 వార్డులోని, ఇందిరానగర్, లందగుట్ట, దళిత కాలనీ, శారదా అపార్ట్మెంట్ లోని గ్రేటర్ కమ్యూనిటీ, ముస్లిం మైనారిటీలను ఏకం చేసి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుంభం అనీల్ కుమార్ రెడ్డికి గెలిపించాలని కోరగానే ప్రజలు నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుంభం అనీల్ కుమార్ రెడ్డినీ గెలుపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేస్తారని, వారి సహాకారంతో నేడు మెజార్టీ ఓట్లు సాదించుకోవడం జరిగిందని, వారందరికీ కాంగ్రెస్ పార్టీ పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో వారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని వారికి ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తామని,కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొందిన కుంభం అనీల్ కుమార్ రెడ్డి ఐదు సంవత్సరాలు వారికి అండగా ఉంటారని తెలిపారు.



## లక్ష్మీనరసింహస్వామి ని దర్శించుకున్న బీర్ల అభిమానులు

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- వలిగొండ మండలం వేములకొండ శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అభిమానులు,కాంగ్రెస్ శ్రేణులు,ఎమ్మెల్యే గా గెలవటం తో ప్రత్యేక పూజలు నిర్వహించి,మొక్కులు చెల్లించుకున్నారు.



## అంబులెన్స్‌లో మహిళ ప్రస్తవం

వాయిస్ టుడే బోధన్: పట్టణంలో సోమవారం ఉద్మిర్ గల్లీ కి చెందిన మహిళ న్యావనంది లావణ్య కు మూడో కాన్పు నిమిత్తం 108 అంబులెన్స్ లో బోధన్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో నొప్పులు అధికమవడంతో జలాల్ బుఖారి దర్గ వద్ద అంబులెన్స్ నిలిపి 108 సిబ్బంది లక్ష్మణ్ కేశవ్ కుమార్ సుఖప్రస్తావం చేశారు దాంతో లావణ్య కు పండంటి మగ బిడ్డ జన్మించింది ఇరువురి క్షేమంగా బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు సుఖ ప్రస్తావం చేసిన బోధన్ 108 అంబులెన్స్ సిబ్బందికి లక్ష్మణ్ కు కేశవ్ కుమార్ లకు వైద్యులు అభినందించారు కుటుంబ సభ్యులు.

## కాంగ్రెస్ పార్టీ గెలుపుపై కరీంనగర్ న్యాయవాదుల సంబరాలు

కాంగ్రెస్ పార్టీ గెలుపు పై సోమవారం కరీంనగర్ జిల్లా కోర్టులోని న్యాయవాదుల ఆధ్వర్యంలో స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించడం చాలా సంతోషకరమన్నారు. పార్టీ గెలుపు కోసం సహకరించిన కాంగ్రెస్ కార్యకర్తలకు, మేధావులకు, ఉద్యోగులకు న్యాయవాదులకు, అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కల్లేపల్లి లక్ష్మయ్య, వేల్పుల బాలకిషన్, ఉప్పుల అంజనీ ప్రసాద్, లుక్క రాజేషం, రూపిరెడ్డి దేవేందర్ రెడ్డి, కొత్తకొండ శంకర్, రాచకొండ ప్రభాకర్, కొత్త ప్రకాశ్, పెంచాల లక్ష్మణరావు, రాయి కంటి కుమార్, కొత్త నర్సింహ రెడ్డి, పాస్తం ఆంజనేయులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.





# లెక్కలు వేసుకొని చేస్తే 'కేజీఎఫ్'లాంటి సినిమా వస్తుందా?

సుధీర్ బాబు కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. సుమంత్ జి.నాయుడు నిర్మాత. మాళవిక శర్మ కథానాయిక. జ్ఞాన సాగర్ ద్వారక దర్శకుడు. ఇటీవల టీజర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సోమవారం చిత్రబృందం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. సుధీర్‌బాబు మాట్లాడుతూ "సాగర్ చెప్పిన కథ నాకు బాగా నచ్చింది. కానీ చేయాలా, వద్దా? అనే డైలామాలో ఉన్నాను. ఎందుకంటే ఈ సినిమాకు భారీ బడ్జెట్ అవసరం. మా నిర్మాత మాత్రం 'లెక్కలు వేసుకొని చేస్తే 'కేజీఎఫ'లాంటి సినిమాలొస్తాయా?' అని చాలా ధైర్యంగా ముందుకు వచ్చారు. పరిశ్రమకు ఇలాంటి నిర్మాతలు కావాలి. సాగర్‌కి అన్ని విభాగాలపై పట్టుంది. నా లుక్ బాగుందన్న ప్రశంసలు దక్కుతున్నాయంటే దానికి కారణం దర్శకుడే. సెట్స్‌కి చాలా ప్రాధాన్యం ఉంది. కొంతమంది మా సెట్స్ చూసి 'సలార్' షూటింగ్ జరుగుతోందా? అని ఆశ్చర్యపోయార"న్నారు. "నా రెండో చిత్రానికే ఇంత పెద్ద బడ్జెట్ ఇస్తారని నేను ఊహించలేదు. సుధీర్‌బాబు ఎంత కష్టపడతారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆయన హార్డ్ వర్క్ ఈ చిత్రంలో అడుగడుగునా కనిపిస్తుంద"న్నారు దర్శకుడు. "టీజర్‌కి చాలా గొప్ప స్పందన వచ్చింది. ఓ మంచి సినిమా చేశామన్న నమ్మకం మా అందరికీ కలిగింద"ని నిర్మాత చెప్పారు.

# యానిమల్‌లో నగ్నంగా నటించింది ఈమే!

రణబీర్ కపూర్, రష్మిక కాంబినేషన్‌లో సందీప్ రెడ్డి వంగా రూపొందించిన 'యానిమల్' చిత్రం బాక్సాఫీసు రికార్డులు తిరగరాస్తోంది. ఈ సినిమా చూస్తూ రణబీర్ అభిమానులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. అయితే ఈ సినిమాలో ఉన్న మితి మీరిన హింస, అసభ్యకరమైన డైలాగులు, ముఖ్యంగా న్యూడ్ సీన్ విమర్శలకు గురవుతున్నాయి. ఈ సినిమాలో ఓ సన్నివేశంలో రణబీర్ పాత్ర తన భార్య(రశ్మిక)ను మోసం చేసి, మరో యువతి జోయాతో శారీరక సంబంధం ఏర్పరచుకుంటాడు. ఈ సందర్భంగా వచ్చే న్యూడ్ సీన్ పలు విమర్శలకు కారణమైంది. ఇంతకీ ఈ న్యూడ్ సీన్‌లో పాల్గొన్న నటి పేరు ఏమిటో తెలుసా..? త్రిప్తి దిమ్రి. ఈ చిత్రంలో నటించిన రణబీర్ కపూర్, రష్మిక, అనిల్ కపూర్, బాబీ డియోల్.. వీరందరూ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్నారు కానీ త్రిప్తి విషయం మాత్రం బయట ఎక్కడా వెల్లడించలేదు. 'యానిమాల్' విడుదలయ్యాక ఆమె గురించి సోషల్ మీడియాలో తెగ చర్చ జరుగుతోంది. 29 ఏళ్ల త్రిప్తి శ్రీదేవి నటించిన 'మామ్'లో తొలిసారిగా నటించింది. ఆ తర్వాత ఆమె 'పోస్టర్ బాయ్స్' సినిమాలో కొంత ప్రాధాన్యం కలిగిన పాత్ర పోషించింది. 'బుల్‌బుల్' చిత్రంతో ఆమె ఫిల్మ్ ఫేర్ అవార్డ్ పొందడం గమనార్హం. 'యానిమల్' చిత్రంలో ఏ మాత్రం మొహమాట పడకుండా బోల్డ్‌గా నటించడంతో ఒక్కసారిగా అందరి దృష్టినీ ఆకర్షించింది త్రిప్తి.





# యుద్ధానికి సమయం ఖరారు?

'ధూమ్' సిరీస్‌లో జాన్‌అబ్రహం, హృతిక్, ఆమీర్‌ఖాన్‌లు పోషించిన సూపర్‌హీరోస్ పాత్రలపై ఓ బుక్ రాయొచ్చు. భారతీయ వెండితెరకు హాలీవుడ్ హంగులద్దిన పాత్రలవి. వాటి ప్రేరణతో 'వార్' చిత్రాన్ని కూడా నిర్మించింది యష్‌రాజ్ సంస్థ. ఇప్పుడు 'వార్–2'కి రెడీ అయ్యింది. ఇందులో సూపర్‌హీరోగా మన టాలీవుడ్ స్టార్ తారక్ కనిపించనుండటం విశేషం.

ఇది తెలుగు ప్రేక్షకులందరూ ఆనందించాల్సిన, గర్వించాల్సిన విషయమే. ప్రస్తుతం 'దేవర' షూటింగ్‌లో బిజీగా ఉన్న తారక్ 'వార్–2' షూటింగ్‌లోకి ఎంట్రీ ఇచ్చేదెప్పుడు? అనే విషయంపై గతంలో పలురకాల వార్తలు వచ్చాయి. లేటెస్ట్ అప్‌డేట్ ఏంటంటే.. వచ్చే ఏడాది మార్చి రెండోవారం నుంచి తారక్ 'వార్–2' షూటింగ్‌లో పాల్గొనబోతున్నాడు. రెండువారాలపాటు ఈ షెడ్యూల్ జరుగుతుందని తెలిసింది. మళ్లీ ఏప్రిల్‌లో 'దేవర' షెడ్యూల్‌లో పాల్గొంటాడు తారక్. మళ్లీ మే నెలలో 'వార్–2' షెడ్యూల్ ఉంటుందట. ఈ షెడ్యూల్‌లో హృతిక్, తారక్‌లపై యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించనున్నాడు. దీనికోసం హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్స్‌ని రంగంలో దింపుతున్నారనేది లేటెస్ట్ న్యూస్.

ఇక 'వార్–2' కథ విషయానికొస్తే.. ఇది ఇద్దరు స్నేహితుల కథ అని తెలుస్తున్నది. కొన్ని కారణాల వల్ల ఇద్దరూ విడిపోతారట. కానీ మంచి కోసం మళ్లీ కలిసి చెడుపై యుద్ధం చేస్తారట. ఆ ఇద్దరు స్నేహితులుగా హృతిక్, తారక్ నటిస్తుండగా, జాన్‌అబ్రహం ఇందులో నెగిటీవ్ పాత్ర పోషించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. కైరా అద్వానీ కథానాయికగా ఖరారైనట్టు తెలుస్తున్నది.



# నా సామి రంగా అంటున్న ఆషికా రంగనాథ్

తన దశాబ్దాల కెరీర్‌లో ఎందరో ప్రతిభావంతులైన దర్శకులను పరిచయం చేసిన కింగ్ నాగార్జున అక్కినేని తన తాజా చిత్రం 'నా సామి రంగ'తో మరో నూతన దర్శకుడు విజయ్ బిన్నీకి అవకాశం ఇచ్చారు. ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ కథానాయికగా నటిస్తుండగా, ఈరోజు మేకర్స్ ఆమె ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు.

మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పై నిర్మాత శ్రీనివాస చిట్టూరి మ్యాసివ్ బడ్జెట్‌తో భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. బ్లాక్ బస్టర్ రైటర్ ప్రసన్న కుమార్ బెజవాడ ఈ చిత్రానికి కథ, మాటలు అందించారు. 'నా సామి రంగ' 2024 సంక్రాంతి కానుకగా గ్రాండ్ గా విడుదల కానుంది.


# కమల్ నాయిక ఆమేనా?

కమల్‌హాసన్, మణిరత్నం.. అనగానే 'నాయకుడు' సినిమా గుర్తొస్తుంది. ఆ సినిమా వచ్చి 36ఏళ్లు నిండాయి. అంత సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ కమల్‌హాసన్, మణిరత్నం కలిసి పనిచేస్తున్న సినిమా 'థగ్ లైఫ్'. ప్రకటన వచ్చిన నాటినుంచి ఈ సినిమాపై ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. విభిన్న కథలతో సినిమాలు చేసే మణిరత్నం.. కమల్‌తో చేయబోతున్న సినిమాకు ఏ తరహా కథను ఎంచుకొని ఉంటాడన్నది ఇప్పుడు సినీవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అంచనాలకు అందని రీతిలో ఈ సినిమా కథ, కథనాలు ఉంటాయనేది చెన్నయ్ సమాచారం. ఇదిలావుంటే, ఇందులో కథానాయికగా త్రిష, నయనతార పేర్లు అప్పట్లో ప్రముఖంగా వినిపించాయి. ఆ తర్వాత ఐశ్వర్యరాయ్ దాదాపు ఖరారైనట్టు వార్తలు కూడా వచ్చాయి. అయితే, ఇప్పుడు వీరెవర్నీ కాకుండా మలయాళం కథానాయిక మంజు వారియర్‌ని హీరోయిన్‌గా ఫైనల్ చేశారనేది టాక్. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నవి. ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే.



# నిన్న రాజమౌళి - నేడు సందీప్ రెడ్డి

## బాలీవుడ్ బిత్తరపోయేలా చేస్తున్న మరో తెలుగోడు




బాహుబలి -1, బాహుబలి - 2, ఆర్.ఆర్.ఆర్" చిత్రాలతో బాలీవుడ్ బిత్తరపోయేలా చేశాడు దర్శక ధీరుడు రాజమౌళి. "కబీర్ సింగ్, యానిమల్" చిత్రాలతో ఇప్పుడు అదే పని చేస్తున్నాడు సందీప్ రెడ్డి వంగా. రాజమౌళి భారీ బడ్జెట్, బీభత్సమైన గ్రాఫిక్స్ తో చేసిన పని... సందీప్ రెడ్డి లిమిటెడ్ బడ్జెట్ తో, చాలా సింపుల్ గా స్ట్రాంగ్ ఎమోషన్స్ తో చేస్తున్నాడు. అయితే... హింస, శృంగారం శృతి మించి పోతున్నాయి అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అది వేరే విషయం. మాస్, క్లాస్ అన్న తేడా లేకుండా... ఇటు స్వదేశంలో మాత్రమే కాదు, విదేశంలో సైతం సందీప్ చిత్రాలకు బ్రహ్మరథం పడుతున్నారు. తెలుగు దర్శకులకు మరింత గౌరవాన్ని తెచ్చిపెడుతున్న సందీప్ రెడ్డి తన తదుపరి చిత్రాన్ని ప్రభాస్ తో ప్లాన్ చేస్తున్న విషయం తెలిసిందే!!

# ముహూర్తం కుదిరింది

'కేజీఎఫ్ 2' తరవాత యశ్ చేసే సినిమా ఏమిటి? ఎవరితో? అనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. యశ్ తదుపరి ప్రాజెక్ట్‌పై ఎవరికీ ఎలాంటి క్లూ అందలేదు. యశ్ కూడా 'కొన్నాళ్లు ఓపిక పట్టండి. మీకు శుభవార్త చెబుతా' అని ఊరిస్తూ వచ్చాడు. చివరికి ఆ కొత్త సినిమాకు రంగం సిద్ధమైంది. తన తదుపరి చిత్రాన్ని అధికారికంగా ప్రకటించడానికి యశ్ అన్ని ఏర్పాట్లూ చేసుకొన్నాడు. యశ్ కొత్త సినిమా కబురు ఈనెల 8న తెలియజేయనున్నారు. అదే రోజున దర్శకుడు, నిర్మాత, టైటిల్ తదితర వివరాల్ని అధికారికంగా ప్రకటిస్తారు. యశ్ నటించే 19వ చిత్రమిది. భారీ యాక్షన్ డ్రామా నేపథ్యంలో ఈ కథ సాగబోతోందని ఇన్ సైడ్ వర్గాలు చెబుతున్నాయి.






# నిర్మాణరంగంలోకి కొత్త సంస్థ

వరల్డ్ యానిమేషన్ రంగంలో తనదైన గుర్తింపు సంపాదించుకున్న గ్రీన్ గోల్డ్ గ్రూప్ ఇప్పుడు చిత్ర నిర్మాణరంగంలోకి కూడా ప్రవేశించింది. చిలకా ప్రొడక్షన్స్ పేరుతో ప్రారంభమైన ఈ సంస్థ లోగోని అగ్ర నిర్మాత అల్లు అరవింద్ , శరత్ మరార్ విడుదల చేశారు. సోమవారం ఏర్పాటైన ఈ కార్యక్రమంలో నిర్మాత రాజీవ్ చిలక మాట్లాడుతూ 'లయన్ కింగ్ సినిమా చూశాక ఇలాంటి చిత్రాన్ని ఇండియాలో ఎందుకు తీయకూడదని అనిపించింది. వాల్ట్ డీస్నీ నాకు ఎప్పుడూ ఓ ఇన్‌స్పిరేషన్. నేను యానిమేషన్ రంగంలోకి అడుగుపెట్టినప్పుడు చాలా ఇబ్బందులు ఉండేవి. వాటిని అధిగమించి సిన్సియర్‌గా కష్టపడుతూ వచ్చాం. 'కృష్ణ' , 'చోటా బీమ్' వంటి యానిమేటెడ్ ఫిల్మ్స్ తీశాం. ప్రస్తుతం తెలుగులో రెండు సినిమాలు, హిందీలో ఓ చిన్న పిల్లల చిత్రం తీస్తున్నాను. ఇవి కాకుండా చాలా ప్లాన్స్ ఉన్నాయి. పరిశ్రమలో అల్లు అరవింద్‌గారిలా ఎదగాలని ఉంది' అన్నారు. సీనియర్ నటులు సి.ఎస్.ఆర్. ఆంజనేయులు తమకు పెద్ద తాత అవుతారని చిలక శ్రీనివాస్ చెప్పారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ 'ఇలాంటి కొత్త ప్రయోగాలు చేసే వ్యక్తుల్ని, సంస్థలను పరిచయం చేయడం నాకు ఆనందం. రాజీవ్ అంటే నాకు అభిమానం, తెలియని ప్రేమ. ఆయన చేసిన 'చోటా బీమ్'ను నేను తెలుగులో విడుదల చేశాను. తన పని తాను సైలెంట్‌గా చేసుకొనే వ్యక్తి ఆయన. అతిశయోక్తి కాకపోతే రాజీవ్‌ను రాజమౌళితో పోల్చవచ్చు. ఈ సంస్థ ఎన్నో మంచి చిత్రాలు నిర్మించిన విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు.